## నేటి కందం-నేటికి అందం

జొన్నగిరిని స్వర్ణగిరిగ
మిన్నగ రూపొంద జేయు మేటి తలపుతోన్
తిన్నగ స్వర్ణోత్పత్తిని
ప్రన్ననతో చంద్రబాబు ప్రారంభించెన్ !!

(కర్నూలు జిల్లాలోని జొన్నగిరి పేరును స్వర్ణగిరిగా మార్చి నాలుగు వందల కోట్లతో ప్రైవేటు బంగారు ఉత్పత్తి ఫ్యాక్టరీని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఇది ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ ఆప్రాంత అభివృద్ధికి దోహదం చేస్తుంది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

మూడు రాష్ట్రాల
ముఖ్యమంత్రుల బేటి
తుంగభద్ర నీటి తగువు
తీరితేనే లాభసాటి
న్యాయవాట ఎవరికెంతో
నిగ్గు తేల్చుకునే బాట
కేంద్రం గుప్పిట్లో పెడితే
కలకాలం తెగని మాట

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శనివారం 27-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:250 పేజీలు:6 వెల: రూ.1/-


## రూ.107 కోట్లతో నాలుగు చెరువుల పునరుద్ధరణ..

**-మూసాపేట కాముని చెరువుకు రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు**
**-వరద ముంపు నివారణ, భూగర్భ జలాల పెంపే లక్ష్యం..**
**-ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రాలుగా తీర్చిదిద్దనున్న ప్రభుత్వం**



హైదరాబాద్, జూన్ 26:హైదరాబాద్‌లో వరద ముంపు సమస్యను తగ్గించడం, భూగర్భ జలాల మట్టాన్ని పెంచడం లక్ష్యంగా హైడ్రా (ఊజఆఖీం) చేపట్టిన చెరువుల పునరుద్ధరణ పనులకు వేగం పెరిగింది. రూ.107 కోట్లతో నాలుగు చెరువులను అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా కూకట్‌పల్లి మండలం మూసాపేటలోని కాముని చెరువు పునరుద్ధరణ పనులకు హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ భూమిపూజ చేసి శ్రీకారం చుట్టారు.

హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా 48 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కాముని చెరువును సుమారు రూ.21 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు. మొత్తం నాలుగు చెరువుల పునరుద్ధరణ కోసం రూ.107 కోట్లను కేటాయించినట్లు అధికారులు తెలిపారు. చెరువు పరిసరాలను పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల ఆట స్థలాలు ఏర్పాటు చేయనున్నారు. తద్వారా ఈ ప్రాంతాలను ప్రజలకు ఆహ్లాదకరమైన విహార, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించారు.

ఈ సందర్భంగా అధికారులకు హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో వరద నీరు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రవహించేలా చెరువుల ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లను పటిష్టం చేయాలని ఆదేశించారు. అలాగే మురుగు నీటి సమస్య, దుర్వాసన నివారణ కోసం చెరువులోని పూడికను పూర్తిగా తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువుల పునరుద్ధరణతో నగరంలో వరద ముప్పు తగ్గడంతో పాటు భూగర్భ జలాల మట్టం పెరగడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం, ప్రజలకు మెరుగైన విహార వసతులు అందుబాటులోకి రావడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని అధికారులు భావిస్తున్నారు.

## డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: సీఎం రేవంత్



హైదరాబాద్, జూన్ 26: సమాజాన్ని డ్రగ్స్ నాశనం చేస్తాయి. డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు నియామకం



హైదరాబాద్, జూన్ 26: తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలాఖరుతో ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీకాలం ముగియనుంది. ఆ వెంటనే సంజయ్ జాజు బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, రాష్ట్ర పరిపాలనపై ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. 1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శిగా పనిచేశారు.

రాష్ట్ర విభజన తర్వాత ఆయనను తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. అయితే, 2014 అక్టోబర్ నెలలో డిప్యూటేషన్ పైన కేంద్ర సర్వీసుకు వెళ్లిన సంజయ్ జాజు.. 2018, మార్చి వరకు ఎన్‌హెచ్‌ఐడీసీఎల్ డైరెక్టర్‌గా, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శిగా పనిచేశారు. 2024 నుంచి కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం.. కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజును తిరిగి మాతృ రాష్ట్ర కేడర్‌కు (తెలంగాణకు) పంపుతూ కీలక నిర్ణయం తీసుకుంది.

## ఈ వారంలోనే కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ.. రాష్ట్రపతిని కలిసిన అమిత్ షా



న్యూఢిల్లీ, జూన్ 26: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని మంత్రివర్గంలో కీలక మార్పులు జరగబోతున్నట్లు సమాచారం. ఈ వారమే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ అంశంపై వివరించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా కలిశారు. మరోవైపు బీజేపీలోనూ సంస్థాగత నిర్మాణంలో మార్పులు జరగనున్నాయి. కేంద్రం మంత్రివర్గంతోపాటు బీజేపీ కేంద్ర పదవుల్లోనూ మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

దీనిపై బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నారు. తన కొత్త టీంను ఎన్నుకునే పనిలో ఉన్నారు. బీజేపీలో పదవుల నియామకం, మార్పులు వంటివి ఈ నెలాఖరులోపు పూర్తవుతాయి. మంత్రివర్గంలో మార్పులు, చేర్పుల గురించి కొందరు కేంద్ర మంత్రులతో కూడా నితిన్ నబిన్ ఇదివరకే మాట్లాడినట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్, బీజేపీ కార్యవర్గాన్ని కూడా ఇటీవల మార్చిన సంగతి తెలిసిందే. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని యూబీ బీజేపీ కార్యవర్గంలో మార్పులు చేశారు. ఇదే సమయంలో కేంద్ర మంత్రివర్గ పునర్వ్యస్థీకరణకు సంబంధించి తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొందరు మంత్రులకు ఇటీవల పార్టీ పరమైన బాధ్యతల్ని కూడా అధిష్టానం అప్పగించింది. ఇటీవలే కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ తన పదవికి రాజీనామా చేశారు.

అలాగే, ఇటీవలే కొందరు కొత్తగా ఎంపీలుగా రాజ్యసభలోకి అడుగుపెట్టారు. వీరిలో కొందరికి కేంద్ర మంత్రి పదవులు దక్కే అవకాశాలున్నాయి. అయితే, ఈ అంశంపై మోదీ, అమిత్ షా సహా బీజేపీ నాయకత్వం పూర్తి గోప్యత పాటిస్తోంది. మోదీ తన చర్యల్ని చివరి నిమిషం వరకు వెల్లడించరు. అందువల్ల మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై అధికారిక ప్రకటన వరకు ఎదురు చూడాల్సిందే.

## తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్, జూన్ 26: రాష్ట్రంలో మారోసారి పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కీలకమైన జిల్లాలు, వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఉన్నతాధికారుల మార్పులు జరిగాయి. ఈ నెలాఖరుతో చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు పదవీ కాలం ముగియనుండటంతో అతడిని సీఎం రేవంత్ రెడ్డి సలహాదారుగా నియమించింది. సీఎంవో నుంచి అజిత్ రెడ్డికి ఉద్వాసన పలికి ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా బదిలీ చేసింది. ఎన్. శ్రీధర్‌కు ముఖ్యమంత్రి సెక్రటరీగా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. సభ్యసాచి ఘోష్‌కు హ్యాండ్ల్యూమ్, టెక్స్‌టైల్స్ శాఖ అదనపు బాధ్యతలను అప్పగించింది. ఉవనీణతీజీజూష్ట్రతిఇ ఖీవటవతీవనిఇవ

అలాగే శైలజా రామయ్యర్‌ను అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, అహ్మద్ నదీమ్‌కు పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చింది. రాహుల్ బొజ్జాకు ప్రకృతి విపత్తుల మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా, ఎం. రఘునందన్‌రావుకు మైన్స్ అండ్ జియాలజీ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించింది. పి. కాత్యాయని దేవి హ్యాండ్లూమ్స్ హ్యాండీ క్రాఫ్ట్స్ స్పెషల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చిన ప్రభుత్వం కె. గంగాధర్‌ను ఆర్‌అండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా బదిలీ చేసింది. టి. వెంకన్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా, కె. విద్యాసాగర్‌ను టూరిజం డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్వర్వులు జారీ చేసింది.

## అయోధ్య నిధుల దుర్వినియోగం.. ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా..

న్యూఢిల్లీ, జూన్ 26:అయోధ్య రామమందిర విరాళాల వ్యవహారంపై కొనసాగుతున్న వివాదం మధ్య కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు. అలాగే ట్రస్టీ అనిల్ మిశ్రా కూడా తన బాధ్యతల నుంచి వైదొలిగినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఇద్దరూ నైతిక బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం

విరాళాల లెక్కింపులో, నగదు నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటీ) విచారణ కొనసాగిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే ఎనిమిది మందిపై కేసులు నమోదయ్యాయి. ఆలయ ఖాతాల నుంచి దాదాపు రూ. 7-7.5 కోట్ల గల్లంతయ్యాయని నివేదికలు సూచిస్తున్నాయి. అయితే అధికారిక లెక్కలు ఇంకా వెలువడలేదు. కాగా, రెండు రోజుల క్రితం సిట్ తమ ప్రాథమిక నివేదికను యూపీ సర్కారుకు సమర్పించింది

అయోధ్య రామాలయానికి వచ్చిన విరాళాలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారిలో చంపత్ రాయ్ డ్రైవర్ కూడా ఉన్నారు. దీంతో నైతిక బాధ్యత వహిస్తూ చంపత్ రాయ్ తన పదవికి రాజీనామా చేశారు.

## తెలంగాణ అటవీ శాఖలో కీలక మార్పులు.. హెచ్ఓఎఫ్ఎఫ్ డా. సి. సువర్ణ పదవీ విరమణ

హైదరాబాద్, జూన్ 26: తెలంగాణ అటవీ శాఖలో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్ర హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ డా. సి. సువర్ణ ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో సువర్ణను ప్రభుత్వ సేవల నుంచి రిలీవ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డా.సి.సువర్ణ పదవీ విరమణతో.. ఆ స్థానంలో సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి వినయ్ కుమార్‌కు హెచ్ఓఎఫ్ఎఫ్ పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది.

తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వినయ్ కుమార్ ఈ బాధ్యతలను కొనసాగించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం జీఓ ఆర్‌టీ నెం. 915ను విడుదల చేసింది. రాష్ట్ర అటవీ శాఖ పరిపాలనా వ్యవహారాలు నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## ఆపరేషన్ సింధూర్‌లో ఆరుగురు సైనికులు వీరమరణం..

**-తొలిసారి పేర్లను వెల్లడించిన ప్రభుత్వం**



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌లో ఉగ్రమూకల్ని అంతం చేసేందుకు భారత సైన్యం గత ఏడాది మే నెలలో ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పెహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో ఆరుగురు భారతీయ సైనిక సిబ్బంది మృతిచెందినట్లు ఇవాళ ప్రభుత్వం పేర్కొన్నది. ఆ ఆపరేషన్‌లో వీరమరణం పొందిన ఆ సైనికులు పేర్లను కూడా వెల్లడించారు. దేశ రాజధానిలో ఉన్న జాతీయ యుద్ధ స్మారకంపై ఆ ఆరుగురు సైనికుల పేర్లను చేర్చనున్నట్లు సైన్యం తెలిపింది. మిలిటరీకి చెందిన సుబేదార్ మేజర్ పవన్ కుమార్, రైఫిల్‌మాన్ సునిల్ కుమార్, లాన్స్ నాయక్ దినేశ్ కుమార్, అగ్నివీర్ మురళీ నాయక్, హవిల్దార్ సునిల్ కుమార్ సింగ్‌తో పాటు భారతీయ వైమానిక దళానికి చెందిన సురేంద్ర కుమార్ ఉన్నారు.

ఆపరేషన్ సింధూర్‌లో ప్రాణాలు కోల్పోయిన ఆరుగురు వీర సైనికులతో పాటు 2025లో జరిగిన వివిధ మిలిటరీ ఆపరేషన్స్‌లో అమరులైన సైనికుల పేర్లను రిలీజ్ చేశారు. నేషనల్ వార్ మెమోరియల్‌లో ఉన్న త్యాగ చక్ర వద్ద ఆ ఆరుగురు సైనికుల పేర్లను రాయనున్నారు. పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాద క్యాంపులపై గత ఏడాది మే 7వ తేదీన భారతీయ సైనిక దళాలు అటాక్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఆపరేషన్ సింధూర్‌ను పాక్ తిప్పికొట్టే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో డ్రోన్ దాడులు, షెల్లింగ్, వైమానిక అటాక్‌లు జరిగాయి. రెండు దేశాల మధ్య నాలుగు రోజుల పాటు భీకర ఘర్షణ జరిగింది. ఆ తర్వాత మే 10వ తేదీన వార్ ముగిసింది.

## కార్గో నౌకపై దాడి

**-తాత్కాలికంగా నిలిచిన సముద్ర ఎస్కార్ట్ కార్యక్రమం**



న్యూ ఢిల్లీ, జూన్ 26: ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒమన్ సమీపంలో సింగపూర్‌కు చెందిన కార్గో నౌక 'ఎవర్ లవ్లీ'పై దాడి జరగడంతో అంతర్జాతీయంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి అనుబంధ అంతర్జాతీయ సముద్ర సంస్థ (ఐఎంఓ) భద్రతా పరిస్థితులను పునఃసమీక్షించేందుకు తన నౌకల ఎస్కార్ట్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది.

ఇరాన్ ఆమోదించిన మార్గాల్లో ప్రయాణించని నౌకలకు భద్రత హామీ ఇవ్వలేమని హెచ్చరించిన కొద్ది గంటల్లోనే ఈ దాడి చోటుచేసుకుంది. బ్రిటన్ సముద్ర భద్రతా అధికారులు దాడిని ధృవీకరించగా, ఇద్దరు అమెరికా ఉన్నతాధికారులు ఈ ఘటన వెనుక ఇరాన్ హస్తం ఉండవచ్చని పేర్కొన్నట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. అయితే ఈ దాడిపై ఇరాన్ ఇప్పటివరకు అధికారికంగా బాధ్యత స్వీకరించలేదు.

దాడి అనంతరం హోర్ముజ్ జలసంధి గుండా చిక్కుకుపోయిన వందలాది నౌకలు, వేలాది మంది నావికుల భద్రతపై సమీక్ష చేపట్టాలని ఐరాస నిర్ణయించింది. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు ఐఎంఓ చేపట్టిన భద్రతా ఎస్కార్ట్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు వెల్లడించింది.

ప్రపంచ చమురు సరఫరాలో గణనీయమైన వాటా హోర్ముజ్ జలసంధి ద్వారానే జరుగుతుంది. ఈ మార్గంలో ఎలాంటి భద్రతా అంతరాయం ఏర్పడినా అంతర్జాతీయ చమురు సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉందని, దాని ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై కూడా పడే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంలో వాస్తవాలు చెప్పాల్సిందే: ఎంపీ చామల

హైదరాబాద్, జూన్ 26: అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల అవకతవకలపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్‌కు సంబంధించి ఎలాంటి అవినీతి జరగలేదనీ కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారని.. కానీ యూపీ సిట్ పోలీసులు చంపత్ రాయ్ మనుషులను అరెస్టు చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని విరాళాలు వసూలు చేశారని అన్నారు. చంపత్ రాయ్‌ను ట్రస్ట్ కార్యదర్శి పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. యూపీ సీఎం పదవికి యోగి ఆదిత్య నాథ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇది యూపీకి సంబంధించిన వ్యవహారం కాదని.. దేశ ప్రజలకు సంబంధించిన అంశమన్నారు.అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ పేరుతో రూ.200 కోట్లు అవినీతి చేశారని ఎంపీ ఆరోపణలు చేశారు. రాముడి పేరు చెప్పి వసూలు చేసిన డబ్బుతో ఏం చేస్తున్నారో బీజేపీ ప్రజలకు చెప్పాలన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ఎంపీలు 20 మందిని, మహారాష్ట్రలో శివసేన ఉద్ధవ్ థాక్రే ఎంపీలు 6 మందిని.. ఒక్కొక్కరికీ రూ.75 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేసిందంటూ వ్యాఖ్యానించారు.

## గచ్చిబౌలి ఏఎంబీ మాల్ ఫ్లైఓవర్‌పై యాక్సిడెంట్.. ఇద్దరు మృతి

హైదరాబాద్, జూన్ 26: హైదరాబాద్ గచ్చిబౌలిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఏఎంబీ ఫ్లైఓవర్‌పై రాంగ్ రూట్‌లో వచ్చిన స్కూటీని బుల్లెట్ బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బుల్లెట్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు.

వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం ఉదయం 7.30 గంటల సమయంలో వినోద్ అనే వ్యక్తి గచ్చిబౌలి నుంచి హఫీజ్‌పేట వైపు బుల్లెట్ బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో హఫీజ్‌పేట నుంచి గచ్చిబౌలి వైపు ఏఎంబీ మాల్ ఫ్లైఓవర్‌పై రాంగ్ రూట్‌లో స్కూటీపై శ్రీకాంత్, విఠల్ వచ్చారు. ఈ క్రమంలో స్కూటీ, బుల్లెట్ బైక్ ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీకాంత్, విఠల్ ఇద్దరూ ఎగిరిపడ్డారు. వారు హెల్మెట్ పెప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అంగ వైకల్య వర్గాల పక్షపాతి హెలెన్ కెల్లర్ !

## (27 జూన్ "హెలెన్ కెల్లర్ దినోత్సవం" సందర్భంగా)

హెలెన్ కెల్లర్ లాంటి కొందరు అభాగ్యులు వినికిడి సమస్యలతో పాటు దృష్టి దోషాలను కూడా కలిగి ఉంటారు. ఇలాంటి చెవిటి-అంధుల హక్కుల కోసం పోరాటం చేసిన ధీర వనితగా బహుముఖ ప్రజ్ఞాశాలి హెలెన్ కెల్లర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయింది. ఇలాంటి శారీరక వైకల్యం కలిగిన అభాగ్యుల పట్ల పౌర సమాజం సానుకూలంగా స్పందించాలనే అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 25 జూన్ నుంచి 01 జూలై వరకు నిర్వహించే "చెవిటి-అంధుల అవగాహన వారం (డెఫ్-బ్లైండ్ అవేర్‌నెస్ వీక్)"లో భాగంగా 27 జూన్ రోజున "హెలెన్ కెల్లర్ దినోత్సవం" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచవ్యాప్తంగా 15 మిలియన్లకు పైగా బధిర-అంధులు ఉన్నట్లు అంచనా. ప్రఖ్యాత చెవిటి - అంధురాలు హెలెన్ కెల్లర్ జన్మదినం 27 జూన్ కూడా ఈ వారోత్సవాల్లో రావడం ప్రత్యేకం సందర్భంగా తీసుకోవాలి. చెవిటి-అంధులను అక్కున చేర్చుకోవడం, వారి హక్కుల హననాన్ని వ్యతిరేకించడం, ఆ వర్గాలకు అన్ని అవకాశాలు కల్పించడం, కెల్లర్ రచనలను చదవడం, హెలెన్ జీవితం నుంచి ప్రేరణ పొందడం లాంటివి నిత్యం జరగాలి.

### బహుముఖ ప్రజ్ఞాశాలి చెవిటి-అంధురాలైన హెలెన్ కెల్లర్:

బధిర-అంధులకు ప్రేరణగా నిలుస్తున్న హెలెన్ కెల్లర్ ఒక చురుకైన, ఆకర్షణీయమైన వక్త, ప్రఖ్యాత రచయిత, అంగవైకల్య వర్గాల పక్షపాతి, వారి అభ్యున్నతికి జీవితాన్ని అర్పించిన త్యాగశీలి. అత్యంత ప్రభావం కలిగించే ఉపన్యాసాలు, ప్రేరణ నింపే రచనలు, అంగవైకల్యం కలిగిన వర్గాల పక్షాన నిలవడం లాంటి పలు సద్గుణాలు కలిగిన హెలెన్ కెల్లర్ 27 జూన్ 1880న అమెరికాకు చెందిన అలబామాలో జన్మించారు. తన 19వ నెలలోనే వినికిడితో పాటు కంటి చూపును కోల్పోయిన చిన్నారి కెల్లర్ నిరుత్సాహపడకుండా తన జీవిత పోరాటాన్ని కొనసాగించింది. తన గురువు అన్నే సుల్లివన్ సహాయంతో చదువులతో పాటు ఆత్మ-ఆవిష్కరణను కొనసాగించింది. విద్యను కొనసాగిస్తూ బి. ఏ ఆర్ట్స్ డిగ్రీ పొందిన తొలి బధిర-అంధురాలిగా రికార్డు నెలకొల్పింది. పలు ప్రేరణాత్మక పుస్తకాలు రచించిన హెలెన్ కెల్లర్ తన ఆత్మకథను "ది స్టోరీ ఆఫ్ మై లైఫ్" అనే పేరుతో రాయడం, అది బహుళ ప్రచారం పొందడం జరిగింది.

చెవిటి-అంధురాలైనప్పటికీ కెల్లర్ దాదాపు 35 దేశాలు తిరిగి తన ప్రసంగాలను కొనసాగించడం, వికలాంగులకు దారి దీపంగా నిలవడం జరిగింది. చేతి వేళ్ల సైగల భాష, పెదవుల కదలికల చేతులతో స్పృశిస్తూ అర్థం చేసుకోవడం, ఫింగర్-స్పెల్లింగ్ బ్రెయిలీ లిపి లోతులు నేర్చుకొని తన సత్తా చాటుతూ పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు, గౌరవాలు పొందారు. దివ్యాంగుల సంక్షేమానికిభారీగా నిధులను సేకరించింది. 30 జూన్ 1925న అంతర్జాతీయ లయన్స్ సంస్థలో పాల్గొని మాట్లాడుతూ అంధుల జీవితాల్లో వెలుగులు నింపాలని, "అంధత్వ నివారణ భటులు (నైట్స్ ఆఫ్ బ్లైండ్)"గా నిలవాలని కోరారు. కెల్లర్ పుట్టిన రోజు 27 జూన్‌న "హెలెన్ కెల్లర్ డే"గా పాటించడం జరుగుతున్నది. తన గురువు సుల్లివెన్ చనిపోవడంతో ఒంటరితనాన్ని గడిపి హెలెన్ కెల్లర్ 01 జూన్ 1968న తుదిశ్వాస విడిచింది.

చెవిటి-అంధుల పట్ల అవగాహనలో భాగంగా పౌర సమాజం తమ సమయాన్ని కేటాయిస్తూ, సంపదను వెచ్చిస్తూ, మేధను ఉపయోగిస్తూ వికలాంగుల చీకటి జీవితాల్లో వెలుగులు నింపే చర్యలకు పూనుకోవాలి. హెలెన్ కెల్లర్ దినోత్సవంలో భాగంగా ఆ మహణీయురాలి విజయ గాథలు వినిపించడం, అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, ప్రచార మాద్యమాల్లో ప్రచారం నిర్వహించడం, మూఢ విశ్వాసాలను మట్టు పెట్టడం, అందరినీ కలుపుకొని అభివృద్ధి బాటన నడవడం లాంటివి ఏర్పాటు చేయాలి. చెవిటి వారిని, అంధులను అక్కున చేర్చుకోవడం మరువరాదని పిలుపునిచ్చిన కెల్లర్ పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శనీయం. సూర్యున్ని చూసే వారికి తన నీడ కనిపించదని నమ్మిన కెల్లర్ జీవితం మనకు ప్రేరణాత్మకం, అనుసరణీయం, అభినందనీయం.



-మధుపాళీ
9949700037

# అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు కావాలి

## -మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రావు

ఆదిలాబాద్, జూన్ 26:మండలంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావు కోరారు.





కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రం లోని గణేష్‌నగర్, మొమిన్‌పూర్ ప్రాంతాల్లోని 72, 73 పోలింగ్ కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన ఎస్ఐఆర్ సర్వేలో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌రావు మాట్లాడుతూ.. అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సర్వే నిర్వహిస్తున్న బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.కే. ముకిద్, మాజీ ఎంపీటీసీ ఎస్.కే. రషీద్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు పెందూర్ ప్రకాష్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్, యువ నాయకులు అబ్బు, హైదర్, మైనార్టీ సెల్ నాయకుడు వసీం, బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిచే ప్రజా గ్రీవెన్స్..

అమరావతి, జూన్ 26: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అన్నారు. శుక్రవారం పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి నియోజకవర్గ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక, రెవెన్యూ, సంక్షేమ పథకాలు, తాగునీరు, రహదారులు, విద్యుత్, పింఛన్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్య 03 ,రెవిన్యూ 4,పోలీస్02, రేషన్ కార్డు 01 మొత్తం సుమారు 10 అర్జీలు ప్రజల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై ఎలాంటి నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీకి తగిన పరిష్కారం చూపేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.





# అత్యవసర పరిస్థితి కాలంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించిన వారికి నివాళులు అర్పించిన ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, జూన్ 26:అత్యవసర పరిస్థితి కాలంలో ప్రజాస్వామిక విలువలను రక్షించిన వారందరికీ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు శ్రద్ధాంజలి ఘటించారు. భారతదేశ చరిత్రలో అత్యంత నిరాశామయ అధ్యాయాలలో ఎమర్జెన్సీ ఒకటి అని ఆయన అన్నారు. ఆ సమయం... మౌనంగా ఉండిపోకుండా, రాజ్యాంగంలోని ఆదర్శాలను నిలబెట్టిన అసంఖ్యాక పౌరుల అసాధారణ ధైర్య, సాహసాలను, ధీరత్వాన్ని చాటిందని కూడా ఆయన అన్నారు.

రాజ్యాంగ విలువల పట్ల దేశ ప్రజల నిబద్ధతను ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. "రాజ్యాంగం 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలకు, హక్కులకు, కర్తవ్యాలకు ప్రతీక. ఈ భావనను మార్గదర్శకంగా స్వీకరించి, భారత్ ప్రజాస్వామిక పునాదులను నిరంతరం పటిష్టం చేస్తుండటంతో పాటు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనే ఆదర్శాలకు కట్టుబడి ఉంటుంది" అని ఆయన అన్నారు.

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, పౌర హక్కులను రక్షిస్తామనే నిబద్ధతను శ్రీ మోదీ పునరుద్ఘాటిస్తూ, "స్వాతంత్ర్యాత్ సుఖమాప్నోతి స్వాతంత్ర్యాల్లభతే పరమ్ స్వాతంత్ర్యాన్నివృత్తిం గచ్ఛేత్ స్వాతంత్ర్యాత్ పరమం పదమ్" అనే సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో పంచుకున్నారు:

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శ్రీ మోదీ ఒక సందేశాన్ని పొందుపరుస్తూ:

"భారతదేశ చరిత్రలో అత్యంత నిరాశామయ అధ్యాయాల్లో ఒకటైన అత్యవసర పరిస్థితి కాలంలో ప్రజాస్వామిక విలువ లను దృఢంగా రక్షించిన వారం దరికీ మనం ఈరోజు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. అత్యవసర స్థితి మన రాజ్యాంగంపై నేరుగా చేసిన దాడి. ఆ కాలంలో పౌర స్వేచ్ఛను తాత్కాలికంగా తొలగించారు. అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు ఉన్న స్వతంత్రాన్ని అణచివేశారు. రాజకీయ నాయకులను, పత్రికా రచయితలను, సంఘ సేవకులను అరెస్టు చేయడమే కాకుండా, మన ప్రజాస్వామ్యానికి మూలాధారంగా ఉన్న సంస్థలపై దాడి చేశారు.

అదే కాలంలో ఎంతో మంది పౌరులు మనకెందుకులే అని ఊరుకోకుండా అసాధారణ ధైర్య సాహసాలను కనబరిచి మన రాజ్యంగంలో పొందుపరిచిన ఆదర్శాలను నిలబెట్టారు.

మన అందరి దృష్టిలో, మన రాజ్యాంగం 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలు, హక్కులు, కర్తవ్యాలకు ప్రతీక. రాజ్యాంగ విలువలను కాపాడతామన్న మన ఉమ్మడి నిబద్ధతను మనం మరోసారి స్పష్టం చేస్తున్నాం. మన రాజ్యాంగ భావన నుంచి మార్గదర్శకత్వాన్ని అందుకొని న్యాయానికి, స్వేచ్ఛకి, సమానత్వానికి, సోదరభావానికి ఎప్పటికీ కట్టుబడి ఉండే భారత్‌ను ఆవిష్కరించుకుందాం."

'సంవిధాన్ హత్యా దివస్' మనకు భారతీయ ప్రజాస్వామ్యాన్ని ఘోరంగా అణచివేసిన అత్యంత నిరాశామయ కాలాన్ని గుర్తుకు తీసుకు వస్తోంది. ఇది ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, పౌర హక్కుల రక్షణకు మనం ఎప్పటికీ కట్టుబడి ఉండాలనే స్ఫూర్తిని మనకు అందిస్తోంది. అత్యవసర స్థితికి ఎదురొడ్డి నిలిచిన వారందరికీ గౌరవ పూర్వకంగా నమస్కరిస్తున్నాను

స్వాతంత్ర్యాత్ సుఖమాప్నోతి స్వాతంత్ర్యాల్లభతే పరమ్
స్వాతంత్ర్యాన్నివృత్తిం గచ్ఛేత్ స్వాతంత్ర్యాత్ పరమం పదమ్" అని పేర్కొన్నారు.

# పల్స్ పోలియోను విజయవంతం చేయాలి..

## -28న పోలియో బూత్ డే-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



కరీంనగర్, జూన్ 26: పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు. ఈ నెల 28న పోలియో బూత్ డే నిర్వహిస్తున్నట్లు ఈ నెల 29, 30 తేదీలలో ఇంటింటి సర్వే చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 62,902 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, పోలియో చుక్కల పంపిణీ కోసం జిల్లాలో 381 బూత్‌లు, 25 మొబైల్ టీమ్స్, 24 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి చిన్న పిల్లల వివరాలను సేకరించాలన్నారు.

ముఖ్యంగా వలస కూలీలు, ఇటుక బట్టీలు, నిర్మాణ రంగంలో పనిచేసే వారి పిల్లలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉండే అవకాశం ఉన్నందున, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్ల వంటి రద్దీ ప్రదేశాలలో ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా ప్రయాణికులకు కూడా సేవలందించాలని, ఈ ప్రక్రియలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యా, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారుల సమన్వయం తప్పనిసరి అని, ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోకూడదన్నారు. అధికారులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలన్నారు.

# ఎలగడపలో పీరీలను దర్శించుకున్న బీఆర్ ఎస్ నేతలు



ఆదిలాబాద్, జూన్ 26: కడెం మండలంలోని ఎలగడప గ్రామంలో నిర్వహిస్తున్న మొహర్రం వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ భూక్య అమ్మి బాపూరావు శుక్రవారం పీరీలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధించాలని, అలాగే బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తిరిగి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ పీరీలకు 11 కొబ్బరికాయలు కొట్టి, బెల్లం, కట్నం సమర్పించారు.

ఈ సందర్భంగా భూక్య అమ్మి బాపూరావు మాట్లాడుతూ.. భూక్య జాన్సన్ నాయక్ ఖానాపూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైతేనే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ది కొండ రాములు, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఉపసర్పంచ్ రాపర్తి లక్ష్మణ్, వెంగా వెంక గౌడ్, మేర రాములు, సంధు శ్రీనివాస్, రాపర్తి పెద్ద లక్ష్మణ్, తోడిశెట్టి లక్ష్మిరాజన్, తోడిశెట్టి బాలయ్యతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎబోలా ఆరోగ్య పరీక్షల కోసం భారత్‌లోని పీఓఈల వద్ద ఎయిర్ సువిధ 2.0 పోర్టల్‌ను ప్రారంభించిన పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డీఐఏఎల్

న్యూఢిల్లీ, జూన్ 26:ఎబోలా వ్యాధి వ్యాప్తి నేపథ్యంలో దేశంలోకి ప్రవేశించే మార్గాల వద్ద ప్రజారోగ్య నిఘాను మరింత బలోపేతం చేయటానికి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ లిమిటెడ్ (డీఐఏఎల్) నేడు ఎయిర్ సువిధ 2.0 పోర్టల్‌ను ప్రారంభించాయి. ఇది ప్రయాణికుల ఆరోగ్య వివరాలను స్వయంగా సమర్పించే అత్యాధునిక కాంటాక్ట్‌లెస్ డిజిటల్ వేదిక. అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనల (ఐహెచ్ఆర్)-2005 ప్రకారం... డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ ద కాంగో, ఉగాండాల్లో విజృంబిస్తున్న ఎబోలా, బుందిబుగ్యో వైరస్ వ్యాధిని మే 17, 2026న అంతర్జాతీయ ఆందోళనకర ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి (పీహెచ్ఈఐసీ)గా డబ్ల్యూహెచ్ఓ ప్రకటించింది. ఈ ప్రకటనను అనుసరించి భారత్‌లో ఈ కొత్త పోర్టల్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న ఈ మహమ్మారి బుందిబుగ్యో వైరస్ డిసీజ్ (బీవీడీ)గా నిర్ధారణ అయింది. కాంగో, ఉగాండాకు సరిహద్దు దేశాలైన సౌత్ సూడాన్ వంటి పొరుగు దేశాలకు కూడా ఈ వ్యాధి వేగంగా సంక్రమించే ప్రమాదం ఉందని తాజా నివేదికలో డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) భాగస్వామ్యంతో ఈ పోర్టల్‌ను రూపొందించారు. దీనిద్వారా అంతర్జాతీయ ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందు గానే ఆన్‌లైన్‌లో హెల్త్ సెల్ఫ్-డిక్లరేషన్ సమర్పించటం తప్పని సరి. ఇందులో గత 21 రోజుల ప్రయాణ వివరాలు, వ్యాధిగ్రస్తులతో ఉన్నారా లేదా అనే సమాచారం, ఏవైనా లక్షణాలు ఉంటే వాటి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ పోర్టల్ ద్వారా వచ్చే సమాచారం ఎప్పటికప్పుడు ఎయిర్‌పోర్టు హెల్త్ ఆఫీసర్, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్, ఐడీఎస్‌పీ, స్టేట్ సర్వైలెన్స్ ఆఫీసర్లకు అందుతుంది. దీనివల్ల ప్రమాదం పొంచి ఉన్న ప్రయాణికులను త్వరగా గుర్తించి, చికిత్స అందించవచ్చు. ప్రయాణికులు విమానాశ్రయంలో దిగాక ఎలాంటి పేపర్లను ఇవ్వాల్సిన పని లేకుండా, సులభంగా, కాంటాక్ట్‌లెస్ పద్ధతిలో ప్రయాణాన్ని ముగించుకోవచ్చు. భారతదేశానికి చేరుకోవటానికి 24 గంటల ముందే ఎయిర్ సువిధ సెల్ఫ్ డిక్లరేషన్ ఫారంను (ఎస్‌డీఎఫ్) పూర్తి చేయాలి. ప్రయాణాన్ని వేగంగా ముగించుకునేందుకు ప్రయాణికులు విమానం ఎక్కటానికి ముందు గానే, వెబ్ చెక్-ఇన్ సమయం లోనే ఈ ఫారాలను నింపాల్సి ఉంటుంది. విమానాశ్రయంలో దిగిన తర్వాత డౌన్‌లోడ్ చేసుకున్న ఎస్‌డీఎఫ్ ఫారాన్ని ఇంటర్నేషనల్ ట్రావెల్ హెల్త్ డెస్క్, ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద చూపిస్తే సరిపోతుంది. ప్రయాణికుల భద్రత, ప్రజారోగ్య ప్రయోజనాల దృష్ట్యా అంతర్జాతీయ ప్రయాణికులందరూ సెల్ఫ్-డిక్లరేషన్ వివరాలను ఖచ్చితంగా, ముందు గానే సమర్పించాల్సిందిగా అధికారులు కోరారు.

# ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌పై ఏసీబీ పంజా..

కరీంనగర్, జూన్ 26: తెలంగాణలో అవినీతి అధికారులపై ఏసీబీ చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా కరీంనగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌పై ఏసీబీ పంజా విసిరింది. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌పై గుండేటి రాముపై ఏసీబీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. తన అధికార హోదాను దుర్వినియోగం చేసి.. చట్టవిరుద్ధంగా ఆస్తులు కూడబెట్టినట్లు వచ్చిన సమాచారంతో ఈ దాడులు చేపట్టారు. అనంతరం ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేశారు అధికారులు.

ప్రస్తుతం కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న గుండేటి రాము గతంలో వేములవాడ ఎస్‌హెచ్‌వోగా కూడా విధులు నిర్వహించారు. ఆయనకు సంబంధించిన జగిత్యాల భవానీనగర్‌లోని అద్దె నివాసంలో ఏసీబీ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

# గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా..



కరీంనగర్, జూన్ 26: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు పేర్కొన్నారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం జీలకుంట గ్రామంలో నిర్మించిన మహిళా సమైక్య భవనాన్ని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామంలో గత రెండున్నరేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ముఖ్యంగా గ్రామం నుంచి పందిళ్లకు వెళ్లే రహదారిని బీటీ రోడ్డుగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. స్థానిక మహిళా సమైక్య భవనానికి ప్రహరీ గోడతో పాటు పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు అన్ని విధాల అండగా నిలుస్తూ ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నారని తెలిపారు. గ్రామంలో మహిళా సంఘ భవనానికి భూమి దానం చేసిన కొట్టే మల్లారెడ్డి పేరును మహిళా భవనానికి పెడుతున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు పంటలకు సరిపడా కాలువ నీరు అందిస్తున్నారని చెప్పారు. వడ్ల కొనుగోళ్లలో కటింగ్ లేకుండా చర్యలు తీసుకుంటూ బోనస్ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. గ్రామంలోని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాగిడి మంగ శ్రీనివాస్ రెడ్డి, ఏపీఎం సంపత్, మాజీ ఎంపీటీసీ రాగిడి రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ రౌతు మనోజ్ క్రాంతివీర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పిట్టల రవికుమార్, ఓదెల మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, బొంగోని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన జీలకుంట సర్పంచ్

గత సర్పంచ్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన జీలకుంట గ్రామ సర్పంచ్ రాగిడి మంగ శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన ప్రభుత్వ విప్ ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ రాగిడి మంగ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరానని తెలిపారు. గత ఎన్నికల్లో గ్రామ ప్రజల సహకారంతో సర్పంచ్‌గా గెలుపొందిన తాను గ్రామ అభివృద్ధినే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావుపై ఉన్న అభిమానంతో, గ్రామ అభివృద్ధిని కాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ఎమ్మెల్యే సహకారంతో ముందుకు సాగుతానని, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మాదక ద్రవ్యాలపై యుద్ధం చేద్దాం..

## -డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దాం..
## -కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

కరీంనగర్, జూన్ 26: మాదక ద్రవ్యాలపై యుద్ధం చేద్దామని, కరీంనగర్ను డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని




పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పిలుపునిచ్చారు. గురువారం మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆదేశాల మేరకు జరుగుతున్న యాంటీ డ్రగ్ అవేర్నెస్ : 'క్ లో భాగంగా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. కలెక్టరేట్ నుండి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు 2 కి.మీ. మేర సాగిన ర్యాలీలో వివిధ విద్యాసంస్థల, నర్సింగ్, మెడికల్ కళాశాలల విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని డ్రగ్స్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

గీతాభవన్ చౌరస్తాలో నర్సింగ్ విద్యార్థినులు ప్రదర్శించిన వీధి నాటకం, అవగాహన గీతాలు అందరినీ ఆలోచింపజేశాయి. స్కిట్లోతో కళ్లకు కట్టిన వాస్తవం ర్యాలీ అనంతరం కన్వెన్షన్ హాలులో సీపీ గౌష్ ఆలం అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. తెలంగాణ ఈగల్ ఫోర్స్ పోస్టర్లను ఆవిష్కరించి, షార్ట్ ఫిల్మ్ ప్రదర్శించారు. చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాల విద్యార్థుల స్కిట్ డ్రగ్స్ వల్ల యువత జీవితాలు, కుటుంబాలు ఎలా నాశనమవుతాయో కళ్ళకు కట్టింది. నర్సింగ్ విద్యార్థినుల నృత్య ప్రదర్శన డ్రగ్స్ రహిత సమాజంపై సందేశమిచ్చింది.

క్రీడలపై దృష్టి పెట్టండి సీపీ..

సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం సమాజాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారి అని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుల ఒత్తిడిని అధిగమించేందుకు డ్రగ్స్ వైపు కాకుండా స్పోర్ట్స్, ఫిజికల్ యాక్టివిటీపై దృష్టి సారించాలని యువతకు సూచించారు. కరీంనగర్ను డ్రగ్ రహిత జిల్లాగా మార్చేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ఇటీవల విద్యా సంస్థల పరిసరాల్లోని 99 పాన్ షాపులపై దాడులు చేసి 52 కేసులు నమోదు చేశామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో అన్ని విద్యాసంస్థల్లో కాన్షియస్ క్లబ్స్ ఏర్పాటు చె శామన్నారు. నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్ సేవించడం, విక్రయించడం ఎన్డీపీఎస్ యాక్ట్ సెక్షన్ 27 ప్రకారం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ యువతలో స్వీయ నియంత్రణ ఉంటేనే డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండి లక్ష్యాలను చేరుకోగలరన్నారు. యాంటీ డ్రగ్స్ వీక్ లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల విజేతలకు సీపీ బహుమతులు అందజేశారు.

అనంతరం అధికారులు, విద్యార్థులు డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. ప్రత్యేక సంతకాల సేకరణ బోర్డుపై సీపీ, అతిథులు సంతకాలు చేసి కరీంనగర్ను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దుతామని సంకల్పించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఎకై ?సజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, డీడబ్ల్యూఓ సరస్వతి, డీసీపీవో పర్వీన్, ఏసీపీలు వేణుగోపాల్, విజయకుమార్, యాదగిరిస్వామి, యాంటీ నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశీయ ఆధునిక గగనతల సంచార నిఘా-నియంత్రణ వ్యవస్థ 'నేత్ర' వినియోగంపై భారత వైమానిక దళానికి తుది అనుమతి

న్యూ ఢిల్లీ, జూన్ 26: రక్షణ రంగ పరిశోధన-అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ఈ రోజు ఓ కీలక విజయాన్ని నమోదు చేసింది. ఈ మేరకు దేశీయ ఆధునిక గగనతల సంచార నిఘా-నియంత్రణ వ్యవస్థ 'నేత్ర' నిర్వహణ -వినియోగంపై భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) తుది అనుమతి (ఎఫ్ఓసీ) ధ్రువీకరణనిచ్చింది. గగనతలంలో పటిష్ఠ నిఘా, పరిస్థితులపై తక్షణ అవగాహన, యుద్ధ నిర్వహణ సామర్థ్యం గణనీయ మెరుగుదల లక్ష్యంగా 'ఐఏఎఫ్', 'డీఆర్‌డీఓ' సహా అనుబంధ పరిశ్రమల సన్నిహిత సహకారంతో ఈ వ్యవస్థను దేశీయంగా రూపొందించారు. దీని రూపకల్పన కోసం 2017 లో ప్రాథమిక నిర్వహణానుమతి (ఐఓసీ) ఇచ్చిన నేపథ్యంలో ఇప్పు డు సంపూర్ణ అనుమతి దఖలు పడింది. అత్యాధునిక ఏరోస్పే స్-రక్షణ సాంకేతిక పరిజ్ఞానాల్లో స్వావలంబన దిశగా భారత్ ప్రస్థానంలో ఇదొక కీలక మలుపు.

కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ 'ఎయిర్ మార్షల్ అవధేష్ కుమార్ భారతి' అధ్యక్షత వహించారు. 'ఎయిర్ చీఫ్ మార్షల్' (రిటైర్డ్) ఆర్.కె. ఎస్.భదౌరియా, డీఆర్‌డీఓ పూర్వ చైర్మన్ డాక్టర్ ఎస్.క్రిస్టఫర్, 'ఐఏఎఫ్' ప్రస్తుత, రిటైర్డ్ సీనియర్ అధికారులు, 'సెంటర్ ఫర్ ఎయిర్ బోర్న్ సిస్టమ్ (సీఏబీఎస్) అవుట్‌స్టాండింగ్ సైంటిస్ట్ అండ్ డైరెక్టర్ శ్రీమతి పి.సంధ్య, 'అవుట్‌స్టాండింగ్ సైంటిస్ట్-చీఫ్ ఎగ్జిక్యూటివ్ (ఎయిర్‌వర్దీనెస్) శ్రీ ఎ.పి.వి.ఎస్.ప్రసాద్, 'నేత్ర ఎఫ్ఓసీ' సైంటిస్ట్ 'జి' అండ్ హెడ్ శ్రీ ఎ.ఎస్.కుమారన్, 'డీఆర్‌డీఓ' లోని ఇతర సీనియర్ అధికారులు, పారిశ్రామిక భాగస్వాములు ఇందులో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎయిర్ మార్షల్ అవధేష్ కుమార్ భారతి ప్రసంగిస్తూ- స్వదేశీ నిఘా, అప్రమత్తత వ్యవస్థ 'నేత్ర' 'ఎఫ్ఓసీ'ని ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్, బాలాకోట్ దాడుల సమయంలో ఈ వ్యవస్థ నిర్వహణాత్మక వినియోగం, విశ్వసనీయతను ఆయన ప్రస్తావించారు. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాల ప్రాధాన్యాన్ని పునరుద్ఘాటిస్తూ- నానాటికీ మారే యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా మార్పుచేర్పుల ద్వారా ఈ వ్యవస్థను సానుకూలం చేసుకోగల సౌలభ్యం ఉందని ఆయన గుర్తుచేశారు. డీఆర్‌డీఓ, ఐఏఎఫ్, పరిశ్రమ భాగస్వాముల మధ్య సమన్వయమే ఈ విజయానికి దోహదం చేసిందని హర్షం ప్రకటించారు.

అనంతరం 'నేత్ర' విజయ ప్రస్థానం గురించి డీఆర్‌డీఓ ఏరోనాటిక్స్ క్లస్టర్ విశిష్ట శాస్త్రవేత్త-డైరెక్టర్ జనరల్ డాక్టర్ కె.రాజలక్ష్మి మీనన్ వివరించారు. కార్యక్రమ లక్ష్యాల సాధన సహా 'ఐఏఎఫ్'కు ఆచరణాత్మక సమర్థ వ్యవస్థను సమకూర్చడంలో ఎదురైన సవాళ్లను, వాటి పరిష్కారం దిశగా తీసుకున్న సాహసోపేత నిర్ణయాలను ఆమె ప్రస్తావించారు. సిస్టమ్ ఇంజనీరింగ్ ప్రాధ్యాన్ని, ఫ్లైట్-టెస్టుల ప్రణాళిక, అమలులో అది సహాయపడిన తీరును కొనియాడారు. డీఆర్‌డీఓ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్ సంబంధిత విశిష్ట శాస్త్రవేత్త - డైరెక్టర్ జనరల్ డాక్టర్ బి.కె. దాస్ మాట్లాడుతూ- భాగస్వాములందరి మధ్య సంపూర్ణ సమన్వయమే ఈ ఘనతకు మూలస్తంభమని పేర్కొన్నారు. 'నేత్ర ఏఈడబ్ల్యూ అండ్ సీ' స్వయం సమృద్ధికి, 'వికసిత భారత్' వైపు ముందడుగుకు ఒక నిదర్శనమని ఆయన అభివర్ణించారు.

### కీలక పాత్రధారులపై ప్రశంసల జల్లు

ఈ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమ విజయంలో కీలక పాత్ర పోషించిన సంస్థలు, యూనిట్లకు ప్రముఖులందరూ ప్రత్యేక ప్రశంసలు, అభినందనలు తెలిపారు. 'నేత్ర' వ్యవస్థను ఒక భావన దశ నుంచి ఆచరణాత్మక తుది అనుమతి స్థాయికి చేర్చడంలో ఈ భాగస్వాములందరి సహకారం అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు.

### స్వదేశీ సామర్థ్య విస్తరణలో కీలక ఘట్టం

'నేత్ర' వ్యవస్థ విజయవంతంగా ఆచరణాత్మ వినియోగానికి సిద్ధం కావడమన్నది సాంకేతిక పరిజ్ఞానాల దేశీయీకరణపై డీఆర్‌డీఓ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. రక్షణ రంగ వినూత్న సేవల దిశగా ఆవిష్కరణలు సహా సామర్థ్య వికాసాన్ని ఇది స్పష్టం చేసింది. అలాగే, అంతిమ వినియోగదారులు (ఐఏఎఫ్), శాస్త్రవిజ్ఞాన సంస్థలు, రక్షణ ఉత్పాదన సంస్థల సమన్వయానికి ఇదొక ఉజ్వల ఉదాహరణగా నిలిచింది.

# వైద్య సంస్థల చట్టంలో జనవిశ్వాస్ సవరణలను ప్రవేశపెట్టిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ... నిబంధనల భారాన్ని తగ్గించడం, నియంత్రణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం

న్యూఢిల్లీ, జూన్ 26: దేశవ్యాప్తంగా రోగుల భద్రతను, వైద్య సేవల్లో నాణ్యతను ఎప్పటికప్పుడు కాపాడుతూనే..., నమ్మకమే ప్రాతిపదికగా పాలనను ప్రోత్సహించడం, నిబంధనల భారాన్ని తగ్గించడం, వాణిజ్య సౌలభ్యాన్ని మెరుగుపరచడం, తగిన రీతిలో నియంత్రణల అమలు లక్ష్యాలుగా కేంద్ర ప్రభుత్వం కీలక సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా 2026 ఏప్రిల్ 8న అధికారిక గెజిట్‌లో ప్రచురించిన జనవిశ్వాస్ (నిబంధనల సవరణ) చట్టం-2026కు అనుగుణంగా... కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2026 జూన్ 22న వైద్య సంస్థల (నమోదు, నియంత్రణ) చట్టం- 2010'కి సవరణలను ప్రకటించింది.

జనవిశ్వాస్ (నిబంధనల సవరణ) చట్టం ? 2026 ద్వారా 23 మంత్రిత్వ శాఖలు, విభాగాల పరిధిలోని 79 కేంద్ర చట్టాల్లోని నిబంధనలను ప్రభుత్వం హేతుబద్ధీకరించింది. ఆరోగ్య రంగంలో చిన్న చిన్న విధివిధానాల ఉల్లంఘనలను క్రిమినల్ నేరాలుగా పరిగణించకుండా మినహాయించడం, ప్రజలే కేంద్రంగా నియంత్రణ పద్ధతులను బలోపేతం చేయడం లక్ష్యంగా... ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని అయిదు చట్టాల్లో 35 నిబంధనలను సవరించారు. మరింత బాధ్యతాయుతమైన, సహాయక నియంత్రణ వ్యవస్థను నెలకొల్పే లక్ష్యంతో చేపట్టిన ఈ విస్తృత స్థాయి సంస్కరణల్లో భాగంగానే... వైద్య సంస్థల చట్టం - 2010కి ఈ తాజా సవరణలను ప్రకటించారు.

సవరించిన నిబంధనల ప్రకారం... ఈ చట్టంలోని 40, 43, 46 సెక్షన్లలో ఉన్న జరిమానా (ఫైన్) అనే పదం స్థానంలో అపరాధ రుసుము (పెనాల్టీ) అనే పదాన్ని చేర్చారు. తద్వారా నిబంధనల అమలు ప్రక్రియ క్రిమినల్ విచారణ పరిధి నుంచి పరిపాలనాపరమైన విచారణ పరిధిలోకి వస్తుంది. అలాగే కంపెనీలు చేసే నిబంధనల ఉల్లంఘనల తీవ్రతను బట్టి వాటి స్వభావానికి తగ్గ క్రమబద్ధమైన, తగిన అపరాధ రుసుములను (పెనాల్టీ) విధించే విధంగా... సెక్షన్- 44ను సవరించారు. దీనితోపాటు మరింత పారదర్శకమైన, సమర్థమైన, జవాబుదారీతనంతో కూడిన విచారణను పెంపొందించడం కోసం... సెక్షన్- 41 కింద ఉన్న న్యాయ నిర్ణాయక అధికార యంత్రాంగాన్ని బలోపేతం చేసింది.

# దేశవ్యాప్తంగా వృద్ధులకు సేవలందించేందుకు సంరక్షకుల వ్యవస్థను మరింతగా విస్తరించిన శతాయు డాష్‌బోర్డు

న్యూ ఢిల్లీ, జూన్ 26:సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ 22.05.2022న శతాయు డాష్‌బోర్డును ప్రారంభించింది. శిక్షణ పొందిన వృద్ధుల సంరక్షకులంతా ఈ డాష్‌బోర్డులో పేర్లను నమోదు చేసుకుని, అవసరమున్న వృద్ధులకు సేవలందించేందుకు వేదికను కల్పిస్తుంది. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి సంస్థ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్, శతాయు డాష్‌బోర్డును నిర్వహిస్తుంది. ఈ సంస్థే వృద్ధుల సంరక్షకులకు శిక్షణనిస్తుంది.

ఈ సమాచార నిధిని మరింత బలోపేతం చేసేందుకు 2023-24, అంతకన్నా ముందు శిక్షణ పొందిన సంరక్షకులకు కూడా శతాయు డ్యాష్‌బోర్డులో స్వయంగా పేరు నమోదు చేసుకునే అవకాశం ఉంది. వీలైనంత ఎక్కువ మంది వృద్ధుల సంరక్షకుల వివరాలు ఈ డ్యాష్‌బోర్డులో ఉండటం వల్ల ఎక్కువ మంది వృద్ధులు వీరి సేవలను పొందే అవకాశం ఉంటుంది. నమోదవుతున్న వివరాలను సాంకేతిక బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. డేటాను ఒకచోట చేర్చి... అవసరమైన మార్పులు, చేర్పులు చేస్తున్నాయి.

వృద్ధుల సంరక్షకుల శిక్షణలో అభ్యర్థుల నమోదు సంఖ్య... ఆయా శిక్షణా కేంద్రాల భౌగోళిక ప్రాంతంపై ఆధారపడి ఉంటుంది. ఈ శిక్షణా కేంద్రాల సమీప ప్రాంతాల నుంచే అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

# టీకాలు, యాంటీబయాటిక్స్, క్యాన్సర్ మందులకు క్యూఆర్ కోడ్ ఆధారిత ట్రాకింగ్ విధానాన్ని విస్తరించిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ

న్యూ ఢిల్లీ, జూన్ 26:భారత ఔషధ సరఫరా వ్యవస్థ నాణ్యత, భద్రత, విశ్వసనీయతను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా షెడ్యూల్ హెచ్2 పరిధిని విస్తరిస్తూ, అదనపు రకాల మందులను క్యూఆర్ కోడ్ ఆధారిత ట్రాకింగ్ విధానంలోకి తీసుకువస్తూ డ్రగ్స్ రూల్స్-1945 సవరణలకు సంబంధించి నోటిఫికేషన్ను విడుదల చేసింది.

సవరించిన నిబంధనల ప్రకారం... అన్ని రకాల టీకాలు, యాంటీబయోటిక్స్, నార్కొటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ ఎన్‌డీపీఎస్ చట్టం-1985 పరిధిలోకి వచ్చే క్యాన్సర్ నివారణ మందులను డ్రగ్స్ రూల్స్-1945లోని షెడ్యూల్ హెచ్2 పరిధిలోకి చేర్చారు.

ఈ సవరణతో మందులను తయారుచేసే సంస్థలు ఉత్పత్తుల ప్రాథమిక ప్యాకేజింగ్ లేబుల్‌పై బార్ కోడ్ లేదా క్యూఆర్ కోడ్‌ను ముద్రించటం తప్పనిసరి. అక్కడ తగినంత స్థలం లేనిపక్షంలో ద్వితీయ ప్యాకేజింగ్ లేబుల్‌పై దీన్ని ముద్రించాల్సి ఉంటుంది. ఈ క్యూఆర్ కోడ్‌లోని సమాచారాన్ని సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ల ద్వారా తనిఖీ చేయవచ్చు. దీనివల్ల ఔషధ సరఫరా వ్యవస్థ అంతటా ఆయా మందుల అసలు గుర్తింపును సులభంగా తనిఖీ చేయవచ్చు.

ఈ క్యూఆర్ కోడ్‌లో సదరు ఉత్పత్తికి సంబంధించిన ముఖ్యమైన సమాచారం ఉంటుంది. ఇందులో ప్రాథమికంగా ఉత్పత్తి ఐడెంటిఫికేషన్ కోడ్, ఔషధానికి సంబంధించిన జనరి క్, బ్రాండ్ పేర్లు, తయారీదారు పేరు, చిరునామా, బ్యాచ్ నంబర్, తయారీ, గడువు తేదీలు, తయారీ లైసెన్స్ నంబర్, అవసరమైన చోట మందులో వాడిన ఇతర సహాయక పదార్థాల వివరాలు ఉంటాయి.

గతంలో ఈ క్యూఆర్ కోడ్ నిబంధన దేశంలో ఎక్కువగా అమ్ముడయ్యే మొదటి 300 రకాల మందులకు మాత్రమే ఉండేది. కానీ ఇప్పుడు తెచ్చిన కొత్త మార్పుల వల్ల అన్ని రకాల వ్యాక్సిన్లు, యాంటీబయాటిక్స్, క్యాన్సర్ మందులు, మత్తు మందులకు కూడా ఇది వర్తిస్తుంది. దీనివల్ల మందుల పర్యవేక్షణ సులువవుతుంది. మార్కెట్లోకి నకిలీ, నాణ్యత లేని మందులు రాకుండా అడ్డుకోవచ్చు. మందుల గుర్తింపును మరింత పటిష్టం చేసే ఈ నూతన విధానం... సరఫరా వ్యవస్థలోని వివిధ దశల్లో మందుల అసలైన నాణ్యతను తనిఖీ చేసేందుకు, వాటిని సులభంగా ట్రాక్ చేయటానికి సహాయపడుతుంది. దీని ద్వారా ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ మరింత బలోపేతం అవుతుంది. మార్కెట్లో నకిలీ మందుల చలామణీని అరికట్టేందుకు వీలవుతుంది. నకిలీ, నాణ్యత లేని యాంటీబయాటిక్ ఔషధాలను సులభంగా గుర్తించి, పర్యవేక్షించటం ద్వారా యాంటీ- మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై దేశం చేస్తున్న పోరాటానికి ఈ విధానం ఎంతగానో దోహదపడుతుంది.

ఈ కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ఔషధ పరిశ్రమకు, ఇతర భాగస్వాములకు తగినంత సమయం ఇవ్వాల్సిన అవసరాన్ని మంత్రిత్వ శాఖ గుర్తించింది. నిబంధనల అమలుకు దశల వారీగా గడువును నిర్ణయించింది. ఇందులో భాగంగా వ్యాక్సిన్లు, మత్తు పదార్థాలు, మానసిక స్థితిపై ప్రభావం చూపే మందులు, క్యాన్సర్ నివారణ మందులకు సంబంధించిన నిబంధనలు జూలై 1, 2027 నుంచి అమల్లోకి వస్తాయి. కాగా, యాంటీబయాటిక్స్‌కు సంబంధించిన నిబంధనలు జూలై 1, 2028 నుంచి అమల్లోకి వస్తాయి.దేశాన్ని మత్తుపదార్థాల రహితంగా మార్చేందుకు ఉద్దేశించిన నషా ముక్త్ భారత్ పోరాటంలో భాగంగా.. ఎన్‌డీపీఎస్ మందుల సరఫరా వ్యవస్థను ట్రాక్ చేసేందుకు, అవి అసలైనవో లేదో తెలుసుకునేందుకు ఈ విధానం సహాయపడుతుంది.

# ఘనంగా శ్రీ ధర్మశాస్త్రా అయ్యప్ప స్వామి 15వ వార్షికోత్సవం



నల్గొండ, జూన్ 26:సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో వెలసిన శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయ పంచదశ (15వ) వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం మేళతాళాల నడుమ దేవాలయ ముఖద్వారానికి మామిడి తోరణాల అలంకరణ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. కీర్తిశేషులు వెంకటేశ్వర్లు-ప్రమీల నివాసం నుంచి స్వామి వారి పట్టు వస్త్రాలతో శోభాయాత్రను నిర్వహించారు.

ఉదయం 9 గంటల నుంచి సహస్రనామార్చన, విశేష అలంకరణలు, శ్రీలక్ష్మీ గణపతి, రుద్ర, మూలమంత్ర హోమాలు, మహా పూర్ణాహుతి, అవభృతం, మహా దాశీర్వచనం, తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. స్వామివారి గ్రామోత్సవం, శోభాయాత్ర భక్తుల జయజయధ్వానాల మధ్య అత్యంత వైభవంగా సాగింది.

ఈ పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ రాయప్రోలు భద్రయ్య శర్మ, శ్రీరామయ్య శర్మ వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. కీతవారిగూడెం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి మహిళా భక్తులు, అయ్యప్పస్వాములు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాల విజయవంతానికి ఆలయ కమిటీ సభ్యులు, దాతలు విశేషంగా సేవలందించారు.

# శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్న మండలి వైస్ చైర్మన్ పండే



నల్గొండ,జూన్ 26: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో జరుగుతున్న 11వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం రాష్ట్ర శాసనమండలి వైస్ చైర్మన్ పండే ప్రకాష్ ముదిరాజ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రకాష్ ముదిరాజ్ కు ఘన స్వాగతం లభించింది. పూజల అనంతరం ఆలయ పండితులు సత్కారం నిర్వహించి వేదాశీర్వచనం జరిపారు. మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కొలుపుల హరినాథ్, మాజీ జెడ్పీటీసీ బొట్ల పరమేశ్వర్, కౌన్సిలర్ యాట శివకుమార్, మాజీ కౌన్సిలర్ బేతి రాములు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ ఆడెపు బాలస్వామి, మాజీ ఆర్టీఏ మెంబర్ పంతం కృష్ణ, మాజీ ఎంపీటీసీ బింగి లతా రవి, నాయకులు ఆరె రాములు, పాల్గొన్నారు.

# ఎస్టీ రిజర్వేషన్లకు 50 ఏళ్లు

## -అచ్చంపేటలో ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర
## -లక్ష్మాపూర్ తండాలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ
## -గిరిజన సంక్షేమమే లక్ష్యమన్న నాయకులు



మహబూబ్‌నగర్, జూన్ 26:ఎస్టీలకు లంబాడీ, ఎరుకల, యానాది తదితర గిరిజన వర్గాలకు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రిజర్వేషన్లు కల్పించి 50 సంవత్సరాలు పూర్త యిన సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ ఆదివాసీ ప్రజాప్రతినిధులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర' శుక్రవారం అచ్చంపేట నియోజకవర్గానికి చేరుకుంది.

నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో బస్సు యాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. అనంతరం బస్సు యాత్ర బృందం అచ్చంపేట మండలం లక్ష్మాపూర్ తండాను సందర్శించింది.

ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జెండాను ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్యే బాలు నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్‌తో పాటు గిరిజన నాయకులు ఆవిష్కరించారు.

అనంతరం నిర్వహించిన సభలో నాయకులు మాట్లాడుతూ.. గిరిజన వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కల్పించిన ఎస్టీ రిజర్వేషన్లు గిరిజనుల అభ్యున్నతికి బాటలు వేసాయని, అదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

# కారును ఢీకొన్న కంటైనర్

నిజామాబాద్, జూన్ 26: నిజామాబాద్ జిల్లా బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి?44పై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటైనర్ కారును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ, అందులో ప్రయాణిస్తున్న నలుగురు సీటుబెల్టులు ధరించి ఉండటంతో ప్రాణాపాయం తప్పింది.

బాల్కొండ ఎస్సై శైలేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్‌కు వెళ్తున్న ఎంహెచ్?01 సీట-8497 నంబర్ గల కారును హెచ్‌ఆర్-47 జీ-5955 నంబర్ గల కంటైనర్ వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో కారు తీవ్రంగా ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న సందీప్‌తో పాటు మరో ముగ్గురు కుటుంబ సభ్యులు సీటుబెల్టులు ధరించి ఉండటంతో వారికి ఎలాంటి గాయాలు కాలేదని ఎస్సై తెలిపారు.

బాధితుడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. అలాగే, హర్యానాకు చెందిన కంటైనర్ డ్రైవర్ రాంగూలబ్‌కు డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేదని ఎస్సై వెల్లడించారు.

# తెలంగాణ, జమ్మూ కాశ్మీర్, లద్దాఖ్‌ల జాతీయ రహదారి ప్రాజెక్టుల నాణ్యత, నిర్వహణపై కేంద్ర మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ సమీక్ష




న్యూఢిల్లీ, జూన్ 26:తెలంగాణ, కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్మూ కాశ్మీర్, లద్దాఖ్‌లలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్) ప్రాజెక్టుల పురోగతి, నాణ్యత, నిర్వహణ అంశాలను కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ న్యూఢిల్లీలో నిన్న వేర్వేరు సమావేశాల్లో సమీక్షించారు. ఈ ప్రాజెక్టుల్లో తెలంగాణకు చెందిన 4,931 కిలోమీటర్ల పొడవైన ప్రాజెక్టులు, జమ్మూ కాశ్మీర్‌కు చెందిన 2,035 కి.మీ. పొడవైన ఎన్‌హెచ్ ప్రాజెక్టులు, లద్దాఖ్‌కు చెందిన 804 కి.మీ. పొడవైన ఎన్‌హెచ్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ సమీక్ష కార్యక్రమంలో కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ సహాయ మంత్రి శ్రీ హర్ష్ మల్హోత్ర కూడా పాల్గొన్నారు.

ప్రసార మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, సామాజిక మాధ్యమాల్లో ప్రజలు పొందుపరిచిన కథనాలు, రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ (ఎమ్‌ఓఆర్‌టీహెచ్), భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ), జాతీయ రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఐడీసీఎల్) అధికారులు, ప్రాజెక్టు గుత్తేదారులు అందించిన సమాచారం సహా వివిధ వర్గాల నుంచి అందిన సమాచారం ఆధారంగా సమీక్షలను చేపట్టారు.

నిర్మాణ పనులు పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు, నిర్వహణ కార్యకలాపాలు, భద్రమైన, సమర్థమైన, దీర్ఘకాలం మన్నిక కలిగి ఉండే హైవే సంబంధిత మౌలిక సదుపాయాలను అందించడానికి తీసుకుంటున్న చర్యలు ఏ దశలో ఉన్నాయో ఈ సమావేశాల్లో శ్రీ గడ్కరీ సమీక్షించారు. నాణ్యత, జవాబుదారీతనం... ఈ అంశాల్లో అత్యున్నత ప్రమాణాలను నిలబెడుతూ ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.

పర్యవేక్షక యంత్రాంగాలను బలోపేతం చేయాలని, పనులను అనుకున్న కాలం లోపల పూర్తి చేయాలని, హైవే కారిడార్ల స్థిరత్వం, సౌకర్యవంతమైన యాత్ర, దీర్ఘకాలిక పనితీరు... వీటిని మెరుగుపరచడానికి ఆధునిక నిర్మాణ సాంకేతికతలతో పాటు అత్యుత్తమ పద్ధతుల్ని అనుసరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రాంతీయ అనుసంధానం, ఆర్థిక వృద్ధికి వేగాన్ని జతపరచడం, పర్యటనలను ప్రోత్సహించడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యాలను పెంపొందించడం కోసం సువ్యవస్థిత రహదారి మౌలిక సదుపాయాలను సమకూర్చడానికి ప్రాధాన్యాన్ని ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.

వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని ప్రాజెక్టులలో తగిన సన్నాహక చర్యలను చేపట్టాల్సిన అవసరం ఉందని కూడా శ్రీ నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. మురుగు పారుదల వ్యవస్థను సమర్థంగా నిర్వహించడం, తీరాల వెంబడి కట్టలను స్థిరీకరించడం, సంరక్షణ సంబంధిత పనులు, వాతావరణం పరంగా ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కొనేందుకు సత్వర ప్రతిస్పందన ప్రణాళికలను చేపట్టడం సహా నివారక, ఉపశమన చర్యలను తీసుకోవాల్సిందిగా అధికారులను ఆయన ఆదేశించారు. ఈ చర్యలు నిరంతరాయ అనుసంధానం, రహదారి భద్రతతో పాటు జాతీయ హైవే నెట్‌వర్క్ దృఢత్వాన్ని నిర్ధారించడానికి చాలా అవసరమని ఆయన అన్నారు.

ఆధునిక ఇంజినీరింగ్ సాంకేతికతలను వినియోగించుకొని ప్రాజెక్టులను నకాలంలో అమలుపరచడంతో పాటు నాణ్యత విషయంలో హామీని అందిస్తూ దేశవ్యాప్తంగా ప్రపంచ శ్రేణి హైవే సంబంధిత మౌలిక సదుపాయాలను సమకూర్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు.

# ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా శశిధర్ ఏకగ్రీవ ఎన్నిక

నిజామాబాద్, జూన్ 26: కమ్మర్‌పల్లి మండల ఉపసర్పంచ్‌ల ఫోరం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నాగపూర్ గ్రామ ఉపసర్పంచ్ ఉల్లెంగల శశిధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రాజరాజేశ్వరి నగర్ ఉపసర్పంచ్ డి. ప్రసాద్, కార్యదర్శిగా హాసకొత్తూరు ఉపసర్పంచ్ ఏనుగు మనోహర్ రెడ్డి, సలహాదారుడిగా నర్సాపూర్ ఉపసర్పంచ్ కట్ట రాజ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఉల్లెంగల శశిధర్ మాట్లాడుతూ, "ఐక్యత మన బలం - సాధనే మన లక్ష్యం" అనే నినాదంతో ముందుకు సాగుతూ ఉపసర్పంచ్‌ల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. మండల ఉపసర్పంచ్‌ల కమిటీ ఏర్పాటుకు సహకరించిన ప్రతి గ్రామ ఉపసర్పంచ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇనాయత్‌నగర్ ఉపసర్పంచ్ మకిలి అనిల్, ఉప్లూర్ ఉపసర్పంచ్ తక్కురి శేఖర్, అమీర్‌నగర్ ఉపసర్పంచ్ ఎం. శంకర్, డీసీ తాండ ఉపసర్పంచ్ జె. నరేష్, కేసీ తాండ ఉపసర్పంచ్ జి. రమేష్, కొనసముందర్ ఉపసర్పంచ్ బి. శంకర్, బషీరాబాద్ ఉపసర్పంచ్ సీహెచ్. భూమేశ్వర్, చౌటుపల్లి ఉపసర్పంచ్ ఎస్. విశాల్, కోనాపూర్ ఉపసర్పంచ్ మోర్తాడ్ ఉదయ్, కమ్మర్‌పల్లి ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు

# స్వర్ణకారుల వృత్తికి రక్షణ కల్పించాలి

## -కార్పొరేషన్, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్



మెదక్, జూన్ 26: స్వర్ణకారుల వృత్తిని రాష్ట్ర ప్రభుత్వం పరిరక్షించాలని, స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌తో పాటు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు పూనా రవీందర్ చారి, ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్ చారి డిమాండ్ చేశారు. గురువారం మెదక్ కలెక్టరేట్ ఎదుట విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్. రాజశేఖర్ రెడ్డి ఆమోదించిన ఐదుగురు సభ్యుల కమిటీ నివేదికను తమిళనాడు తరహాలో తెలంగాణలో అమలు చేయాలని కోరారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలో కూడా స్వర్ణకారుల కార్పొరేషన్, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జీఓ నెం.272కు సవరణలు చేయాలని డిమాండ్ చేస్తూ, దొంగిలించబడిన బంగారానికి సంబంధించి నిరాధార రికవరీ చర్యల నుంచి స్వర్ణకారులకు రక్షణ కల్పించే విధంగా మార్పులు అవసరమని పేర్కొన్నారు.

స్వర్ణకారులపై పోలీసుల వేధింపులను అరికట్టాలని, చేనేత మరియు గీత కార్మికుల మాదిరిగానే 50 ఏళ్లు పైబడిన స్వర్ణకారులకు నెలకు రూ.5 వేల పెన్షన్ అందించాలని కోరారు. వృత్తిని కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడిన స్వర్ణకారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం రాష్ట్ర కార్యదర్శి నెమలి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి వెంకటేశం, పట్టణ అధ్యక్షుడు బ్రహ్మచారి, కార్యదర్శి వేణు, కోశాధికారి కాశీనాథ్, శంకర్ దయాళ్ చారి, రవి, శ్రీనివాస్ చారి, జేఎల్ శ్రీనివాస్ చారి, నవీన్ రవీందర్ చారి, రమేష్ చారి, నరేష్ చారి, సిద్ధిరాములు, కిశోర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, జూన్ 26: (పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. జూన్ 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలో మొత్తం 1,80,405 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు ఈనెల 28న 1137 పోలియో బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేస్తారని వివరించారు. 28న వేసుకోని పిల్లలకు జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తారని చెప్పారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలను సమీప పోలియో బూత్‌కు తీసుకువెళ్లి చుక్కలు వేయించాలని కోరారు.

ఈ కార్యక్రమం విజయవంతానికి అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, మహిళా సంఘాలు, సామాజిక సంస్థలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జూన్ 28న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు నిర్వహించే పల్స్ పోలియో బూత్‌లకు తమ ఐదేళ్లలోపు పిల్లలను తప్పనిసరిగా తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ తల్లిదండ్రులకు సూచించారు. పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఆరోగ్యవంతమైన భావితరాల నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

# ఊట్కూర్ మొహరం వేడుకల్లో పోటెత్తిన భక్తులు

## -కర్ణాటక, మహారాష్ట్ర సహా పలు ప్రాంతాల నుంచి భక్తుల రాక



మహబూబ్‌నగర్, జూన్ 26: నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలో జరుగుతున్న మొహరం మహోత్సవాలు శుక్రవారం నవమి సవారి సందర్భంగా అత్యంత వైభవంగా కొనసాగాయి. హసేన్‌హుస్సేన్ పీర్ల ఉత్సవాల్లో పాల్గొనేందుకు తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తులు ఊట్కూర్‌కు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే అత్యంత వైభవంగా నిర్వహించే మొహరం వేడుకలకు ఊట్కూర్ ప్రత్యేక గుర్తింపు పొందింది.

నవమి సవారి సందర్భంగా పీర్ల ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. ఊరేగింపు మార్గమంతా భక్తులు నీటితో రహదారులను శుభ్రపరచి పీర్లకు దట్టీలు, పూలమాలలు, చాదర్లు సమర్పించి బుక్క వేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. హిందూ-ముస్లిం సోదరభావానికి ప్రతీకగా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు వేడుకల్లో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.

వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచిన హసేన్‌హుస్సేన్ ఉయ్యాల కార్యక్రమం ఊట్కూర్ పట్టణంలోని రుద్రానగర్ ప్రాంతంలో ఆనవాయితీ ప్రకారం నిర్వహించారు. ప్రతి ఏడాది కటిక కులానికి చెందిన కుటుంబంలో జన్మించిన మగ శిశువును ముందుగా ఉయ్యాలలో వేసిన అనంతరం పీర్లను ఉయ్యాలలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా భక్తులు ఉయ్యాలపై పూలు, బొనుగులు చల్లి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

ఉయ్యాల వేడుక అనంతరం పీర్లపై చల్లిన పూలు, బొనుగులను సంతానం లేని దంపతులు భక్తితో స్వీకరిస్తే సంతాన భాగ్యం కలుగుతుందనే విశ్వాసంతో అనేక మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సంప్రదాయం వేడుకలకు ప్రత్యేక ఆధ్యాత్మిక విశిష్టతను తీసుకువచ్చింది. మొహరం వేడుకలను తిలకించేందుకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పీర్ల వద్ద కందూర్లు చేసి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో అధికారులు, పోలీసు సిబ్బంది విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసి వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. మొహరం వేడుకలకు వచ్చిన భక్తులకు సర్పంచ్ ఎం రేణుక భరత్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు వివిధ ఏర్పాట్లు చేశారు. మొహరం వేడుకల్లో మహిళల బొడ్డెమ్మలు, యువకుల అలాయి ఆటపాటలతో ఉత్సాహంగాజరుపుకున్నారు.

# వేదాలు వ్యక్తి ఔన్నత్యం పెంచుతాయి

## -తాడేపల్లి మలయాళ ఆశ్రమంలో వేద పాఠశాల ప్రారంభం

అమరావతి, జూన్ 26:వేదాలు వ్యక్తి ఔన్నత్యం పెంచుతాయని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం ఘంటసాల మండలం తాడేపల్లిలోని శ్రీ మలయాళ స్వామి ఆశ్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన శృతి భారతి వేద పాఠశాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, జాతీయ సంస్కృత యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య గుళ్ళపల్లి శ్రీరామకృష్ణ, ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానంద గిరి స్వామి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పూర్వం వేద ఘోషతో అలరారిన దివిప్రాంతంలో మళ్ళీ వేదాల పునరుజ్జీవనానికి బాటలు వేస్తున్న మలయాళ స్వామి ఆశ్రమం వారిని అభినందించారు. మనిషి నడవడికను తీర్చిదిద్దే వేద అధ్యయనం వినయ సంపన్నత అలవరుస్తుందన్నారు. కేరళ నుంచి వచ్చిన మలయాళ స్వామి ప్రధానంగా ఈ ప్రాంతంలో భక్తి, ధ్యానం, సేవ ధ్యేయాలతో కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తనను తాను తెలుసుకోవటమే నిజమైన విద్య - తనను తాను జయించటమే నిజమైన విజయం అని ప్రభోధించిన మలయాళ స్వామి బోధనలు మనిషి వ్యక్తిత్వాన్ని వికసింపచేస్తాయన్నారు. ఆధునిక శాస్త్ర విజ్ఞానంతో పలుమార్లు అనర్థాలు సంభవిస్తున్న ప్పటికీ, వేద విజ్ఞానం మాత్రమే ఉన్నత సమాజానికి బాటలు వేస్తోందన్నారు. ప్రపంచ దేశాల్లో దాదాపు కుటుంబ వ్యవస్థ అంతరించిపోయినా, భారతదేశంలో కుటుంబ వ్యవస్థ పరిఢవిల్లుతుందంటే అందుకు ప్రధాన కారణం వేదాల ద్వారా భారతీయులు అలవర్చుకున్న సంస్కారమే ప్రధాన కారణం అన్నారు. దేశంలో మరోసారి కుటుంబ వ్యవస్థకు ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో మరోసారి వేదాల సారాన్ని సామాన్య ప్రజలకు చేరవేయటం, నేటితరానికి వేద శిక్షణ ఇవ్వటం ద్వారా సమాజంలో విలువలు కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ దిశగా నేటితరానికి వేద శిక్షణ ఇచ్చేందుకు వేద పాఠశాల ఏర్పాటు చేసిన మలయాళ స్వామి ఆశ్రమ నిర్వాహకులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అభినందించారు.

కార్యక్రమంలో ప్రముఖ తెలుగు కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగశాస్త్రి, ఎన్ఆర్ఐ మూల్పూరి వెంకటరావు సావిత్రి దంపతులు, జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మెన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, అసంగానంద గిరిస్వామి, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, తెలుగు సహస్రావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, కావూరి కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మహిళకు రూ. 2 లక్షల సీఎం సహాయనిధి ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్, జూన్ 26:అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఓ మహిళకు మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అండగా నిలిచారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్‌కు చెందిన ముదునూరి విజయదుర్గా అనే మహిళ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆమె, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం అందించాల్సిందిగా గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డిని ఆశ్రయించారు.

బాధితురాలి పరిస్థితిపై మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి, విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి.. ప్రభుత్వం నుండి రూ. 2 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని మంజూరు చేయించారు.

# జొన్నవిత్తులకు జలధీశ్వరాలయ కమిటీ సన్మానం

అమరావతి, జూన్ 26:ప్రముఖ సినీ గేయ రచయిత, సుప్రసిద్ధ తెలుగు కవి జొన్నవిత్తుల రామలింగశాస్త్రి శుక్రవారం ఘన సన్మానం అందుకున్నారు. "దివి వైభవం" పేరుతో దివిసీమ శతకం రచించి దివిసీమ ఖ్యాతిని విశ్వవ్యాప్తి చేయటంతో పాటు, తద్వారా ఘంటసాల జలధీశ్వరాలయ చరిత్ర విశ్వరంజకం చేసిన జొన్నవిత్తుల వారికి మండల పరిధిలోని తాడేపల్లి మలయాళ స్వామి ఆశ్రమంలో ఘంటసాల శ్రీ జలధీశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ మూల్పూరి వెంకటరావు -సావిత్రి దంపతులు, మలయాళ పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి, జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, అసంగానంద గిరిస్వామి, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆధ్యాత్మిక గురువు విజ్ఞాన స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి సునీత రాజేందర్ ఆర్థిక సహాయం..



వరంగల్, జూన్ 26:మండలంలోని వెలికట్ట గ్రామానికి చెందిన దడిగల చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆదేశాల మేరకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల మహిళా నాయకురాలు మాలోత్ సునీత రాజేందర్ బాధిత కుటుంబాన్ని సందర్శించి మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

అనంతరం కుటుంబ సభ్యులకు రూ.5 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని, ఝాన్సీ రెడ్డిల సహకారంతో గ్రామంలోని పేద బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామన్నారు. నిరుపేదలు ఆపదలో ఉంటే తన వంతు సహాయ సహకారాలను అందిస్తున్నట్లు తెలిపారు.

పేదలకు ప్రతి ఒక్కరు అండగా నిలవాలన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుండి అందే సంక్షేమ పథకాలు సకాలంలో కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద మంగ్య తండా సర్పంచ్ జాటోత్ రాం లాల్ నాయక్, కాంగ్రెస్ నాయకులు బందు వెంకన్న, భోగ కమలాకర్, దీకొండ యాకన్న, కొమ్ము శ్రీను, బందు రవీందర్, బంధు యాకయ్య, నక్క కొమరవెల్లి, కిషన్, లచ్చిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు: ఎమ్మెల్యే

వరంగల్, జూన్ 26: ప్రజాపాలన ప్రభుత్వంలో నిరుపేదలకు పారదర్శకంగా సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు (జీఎస్ఆర్) స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సి) గ్రామ పరిధిలో నూతనంగా నిర్మించిన రెండు ఇందిరమ్మ గృహాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సొంత ఇంటి కలను సాకారం చేయాలనే దృఢ సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల మంది లబ్ధిదారులకు గృహాలను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు.

భూపాలపల్లి నియోజకవర్గానికి మొదటి విడతలో 1500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులు వీటిని త్వరితగతిన పూర్తి చేసుకుంటే రెండో విడతలో మరికొంత మంది నిరుపేదలకు అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. ఎలాంటి దళారుల ప్రమేయం, అవినీతికి తావు లేకుండా అర్హులైన కుటుంబాలకు ఈ పథకం వర్తింపజేస్తామని, ప్రభుత్వం అందించే రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, స్థానిక సర్పంచ్ తౌటం లక్ష్మి, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు ముకిరాల మధువంశీకృష్ణ, పులి తిరుపతిరెడ్డి, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకోమురు, గంగాధరి రవీందర్, కట్కూరి నరేందర్, బుర్ర శ్రీనివాస్, అల్లకొండ కుమార్, దబ్బెట అనిల్ అల్లంరాజు, సర్పంచులు కొడారి అశోక్, నక్క భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఐస్‌లాండ్‌లో తొలి భారతీయ మామిడి పండ్ల ప్రచార కార్యక్రమాలను నిర్వహించిన భారత రాయబార కార్యాలయం, ఏపీఈడీఏ

న్యూ ఢిల్లీ, జూన్ 26:ఐస్‌లాండ్ రాజధాని రేక్‌జావిక్‌లోని భారత రాయబార కార్యాలయం భాగస్వామ్యంలో వ్యవసాయం, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) ఐస్‌లాండ్‌లో తొలిసారిగా భారతీయ మామిడి పండ్ల ప్రచార కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో భాగంగా 2026 జూన్ 24న రేక్‌జావిక్‌లో, జూన్ 25న ఉత్తర ఐస్‌లాండ్‌లోని అకురేరి నగరంలో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భారతీయ మామిడి పండ్లలోని అద్భుతమైన వైవిధ్యాన్ని, వాటి ఎగుమతి సామర్థ్యాన్ని ఈ కార్యక్రమాల ద్వారా అక్కడి వారికి చాటిచెప్పారు. ఐస్‌లాండ్ దేశంలో భారతీయ మామిడి పండ్ల ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించడం ఇదే తొలిసారి.

ఈ సందర్భంగా భారత రాయబారి ఆర్ రవీంద్ర మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన భారతీయ మామిడి రకాల ప్రత్యేకతలను, వాటి అద్భుతమైన రుచులను వివరించారు. ఐస్‌లాండ్ దేశానికి భారతీయ మామిడి పండ్ల ఎగుమతులను మరింత విస్తరించడానికి ఎంతో అనుకూలమైన అవకాశాలు ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఐస్‌లాండ్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన వాణిజ్య ఒప్పందాల డైరెక్టర్ శ్రీ స్వీన్ కె ఐనార్సన్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భారత్-ఈఎఫ్‌టీఏ మధ్య కుదిరిన వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం ద్వారా లభించే వ్యాపార అవకాశాలను ఆయన ప్రస్తావించారు. ఈ ఒప్పందం వల్ల భారత్ నుంచి ఐస్‌లాండ్‌కు మరిన్ని మామిడి పండ్లను సులభంగా దిగుమతి చేసుకోవడానికి గొప్ప అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

ఐస్‌లాండ్ ట్రేడ్ ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ శ్రీ ఓలాఫుర్ స్టీఫెన్సన్ మాట్లాడుతూ... ఐస్‌లాండ్ వ్యాపార వర్గాలలో భారత్ పట్ల ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. భారత్ నుంచి వ్యవసాయ ఉత్పత్తులను, ముఖ్యంగా మామిడి పండ్ల దిగుమతులను పెంచుకోవడానికి ఇరు దేశాల మధ్య అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో భారతదేశ మామిడి ఉత్పత్తిపై భారత రాయబార కార్యాలయ రెండో కార్యదర్శి సుశ్రీ అనీషా తోమర్ ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. ప్రపంచంలోనే అత్యధికంగా మామిడి పండ్లను పండించే దేశంగా భారత్ స్థానాన్ని ఆమె ప్రముఖంగా వివరించారు. నాణ్యతా ప్రమాణాలు, అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు, ప్రపంచవ్యాప్త ప్రచారం ద్వారా మామిడి ఎగుమతులను పెంచడానికి భారత ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యలను ఆమె ఈ సందర్భంగా వివరించారు.

ఈ ప్రచార కార్యక్రమాలకు అక్కడి ప్రతినిధుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఐస్‌లాండ్‌కు చెందిన దిగుమతిదారులు, వివిధ దేశాల దౌత్యవేత్తలు, ఐస్‌లాండ్ వ్యాపార ప్రముఖులు, ఐస్‌లాండ్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ ప్రదర్శనల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ ప్రదర్శనకు విచ్చేసిన అతిథులకు భారత్‌కు చెందిన నాలుగు ఉత్తమమైన మామిడి రకాలైన దశేరి, చౌసా, లంగ్రా, కేసర్లను అందించారు. వీటి అద్భుతమైన రుచి, సువాసన, నాణ్యతను అక్కడి వారు ఎంతగానో ప్రశంసించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి, భారతీయ వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించడానికి, భారత్-ఐస్‌లాండ్ మధ్య పెరుగుతున్న ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేయడానికి ఈ కార్యక్రమాలు ఒక విలువైన వేదికగా నిలిచాయి.

ప్రస్తుతం ఐస్‌లాండ్ దేశం తన మామిడి పండ్ల అవసరాల కోసం ప్రధానంగా థాయిలాండ్, బ్రెజిల్, కంబోడియా, ఘనా, పెరూ దేశాలపై ఆధారపడుతోంది. ప్రత్యామ్నాయ సరఫరాదారులు తక్కువగా ఉండటం వల్ల ఇప్పటివరకు ఆయా దేశాల మామిడి పండ్లు ఐస్‌లాండ్ మార్కెట్లో స్థానం సంపాదించాయి. ఐస్‌లాండ్ గత ఏడాది (2025)లో సుమారు 3.3 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన మామిడి పండ్లను దిగుమతి చేసుకోగా, అందులో దాదాపు 1 మిలియన్ డాలర్ల విలువైన మామిడిని ఒక్క థాయిలాండ్ నుంచే దిగుమతి చేసుకుంది. ఈ కార్యక్రమం సందర్భంగా అక్కడి స్థానిక వినియోగదారులతో భారత రాయబార కార్యాలయ ప్రతినిధులు జరిపిన సంభాషణల్లో.. ఐస్‌లాండ్ ప్రజలకు మామిడి పండ్లంటే చాలా ఇష్టమని, ముఖ్యంగా వాటిని స్మూతీలు, తీపి వంటకాలు (డెజర్ట్‌లు), పండ్ల సలాడ్లలో ఎక్కువగా ఇష్టపడతారని తెలిసింది. ఈ నేపథ్యంలోఅద్భుతమైన రుచి గల భారతీయ మామిడి పండ్లకు ఐస్‌లాండ్ మార్కెట్లో భవిష్యత్తులో చాలా గొప్ప అవకాశాలు ఉన్నాయని స్పష్టమవుతోంది.

# దిగుమతి చేసుకునే మందుల 'మిగులు నిల్వకాలం'
# నిబంధనలను హేతుబద్ధీకరించే ముసాయిదా సవరణ

న్యూఢిల్లీ, జూన్ 26:దిగుమతి చేసుకునే మందుల 'మిగులు నిల్వ కాలం' (షెల్ఫ్ లైఫ్) నిబంధనలను హేతుబద్ధీకరించడానికి... అలాగే ఫార్మా రంగంలో వ్యాపార సౌలభ్యాన్ని మరింత సులభతరం చేయడానికి వీలుగా 1945 నాటి ఔషధ నిబంధనలలోని నియమం 31కి సవరణలను ప్రతిపాదిస్తూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఒక ముసాయిదా నోటిఫికేషన్‌ను ప్రచురించింది.

ఈ ప్రతిపాదిత సవరణకు సంబంధించిన ముసాయిదాను ప్రజలు, సంబంధిత వర్గాల అభిప్రాయాల కోసం 2026 జూన్ 22 నాటి గెజిట్ నోటిఫికేషన్ జీ.ఎస్.ఆర్. 505 (ఈ) ద్వారా కేంద్ర ప్రభుత్వం బహిరంగపరిచింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం దేశంలోకి దిగుమతి చేసుకునే మందులకు కనీసం 60 శాతానికి పైగా నిల్వ కాలం మిగిలి ఉండాలి. తాజా సవరణ ద్వారా ఈ నిబంధనను మార్చి, దిగుమతి చేసుకునే సమయానికి ఆ మందులకు కనీసం 12 నెలల నిల్వ కాలం ఉంటే సరిపోయేలా ప్రతిపాదించారు. అయితే, జీవ సంబంధిత ఉత్పత్తులు,రేడియో ఫార్మాస్యూటికల్స్ వంటి మందుల ప్రత్యేక స్వభావాన్ని, ప్రజారోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాటికి మాత్రం మినహాయింపు ఇచ్చారు. వీటికి ప్రస్తుతం అమల్లో ఉన్న 60 శాతానికి పైగా కనీస నిల్వ కాల నిబంధన యథాతథంగా కొనసాగుతుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు.

ఈ ప్రతిపాదిత సవరణ ద్వారా ఔషధ రంగ వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారడంతోపాటు రోగులకు నాణ్యమైన మందులు నిరంతరం అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం పేర్కొంది. దేశంలోకి దిగుమతి అయ్యే సమయానికి మందులకు కనీసం 12 నెలల నిల్వ కాలం ఉండటం వల్ల, అవి గడువు తీరడానికి ముందే ప్రజలకు పంపిణీ చేయడానికి, వారు వాడుకోవడానికి తగినంత సమయం లభిస్తుంది. దీనివల్ల రోగులకు తగినంత నిల్వ కాలం ఉన్న సురక్షితమైన మందులు అందుతాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఈ సవరణ ద్వారా కఠినమైన నిల్వ కాల నిబంధనల వల్ల ఔషధ సరఫరా వ్యవస్థలో అనవసరంగా జరిగే మందుల వృధాను గణనీయంగా తగ్గించవచ్చు. దీనివల్ల ఔషధాల నిల్వలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడానికి వీలవుతుంది. ఫలితంగా సరఫరా నిర్వహణ మెరుగుపడటంతో పాటు ఖర్చులు తగ్గుతాయని, దేశంలో నిత్యావసర మందుల లభ్యత మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ ప్రతిపాదిత సవరణ కేవలం మందులను దిగుమతి చేసుకునే సమయంలో వర్తించే షెల్ఫ్ లైఫ్ నిబంధనకు మాత్రమే పరిమితమని కేంద్ర మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940, డ్రగ్స్ నిబంధనలు 1945 ప్రకారం మందుల నాణ్యత, భద్రత లేదా వాటి పనితీరుకు సంబంధించిన ఇతర నియంత్రణ నిబంధనలలో ఎలాంటి మార్పులు చేయలేదని స్పష్టం చేసింది.

# గంగమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలి..

నల్గొండ, జూన్ 26:: గంగమ్మ తల్లి ఆశీస్సులు ప్రతి కుటుంబానికి ఉండాలని ప్రముఖ వ్యాపారి విద్యావేత్త సుభాష్ రెడ్డి అన్నారు. మండలంలోని కాచాపూర్ గ్రామంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గంగమ్మ కళ్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దయవల్ల సమృద్ధిగా వర్షాలు పడే పంటలు పండాలని తెలిపారు.

ప్రతి కుటుంబం సంతోషంగా జీవించాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని అన్నారు. ఆలయానికి వచ్చినా ఆయనకు గంగపుత్ర సంఘం ప్రతినిధులు ఘనస్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట గంగపుత్ర సంఘం ప్రతినిధులు, సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు ఉన్నారు.

# టీటీడీకి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు రూ.45 లక్షలు విరాళం

తిరుపతి, జూన్ 26:కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వర స్వామి కొలువుదీరిన తిరుమల లో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయి బాట గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్‌లో నిలబడ్డారు.టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు.

నిన్న స్వామివారిని 62,925 మంది దర్శించుకోగా, 36,297 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి రూ. 3.77 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. గురువారం 4.23 లక్షల లడ్డూల విక్రయం జరిగిందన్నారు.2.40 లక్షల మందికి అన్న ప్రసాదం పంపిణీ జరిగిందన్నారు.

## రూ.45 లక్షలు విరాళం..

హైదరాబాద్ కు చెందిన సాయి బాలాజీ డెవెలపర్స్ సంస్థ శుక్రవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.45 లక్షలు విరాళం గా అందించింది.ఈ మేరకు ఆ సంస్థ భాగస్వామి శ్రీ ఆకుల రవి కుమార్ తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు.

# బీఎల్‌వోల ద్వారా ఇంటింటికీ ఫారాలు పంపిణీ..



ఆదిలాబాద్, జూన్ 26: అదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ముత్తునూరు గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్నారు.

ఫారాలు అందజేసే సమయంలో వాటిని స్కాన్ చేసి నమోదు చేయడంతో పాటు, ఫారాన్ని ఎలా నింపాలి, ఏ వివరాలు నమోదు చేయాలనే విషయాలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్వహిస్తున్నారు.

అలాగే, ఓటర్లు పూర్తిగా నింపిన ఫారాలను తిరిగి స్వీకరించే సమయంలో కూడా బీఎల్‌వోలు స్కానింగ్ నిర్వహించి, వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేస్తున్నారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఓటరు సరైన వివరాలతో ఫారాన్ని పూర్తి చేసి నిర్ణీత గడువులోపు సంబంధిత బీఎల్‌వోకు అందజేసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి ఆచే శివరావు, ముత్తునూరు అంగన్‌వాడీ కార్యకర్త మేశ్రం సుమిత్ర, మేశ్రం కేశవ్, బీఎల్‌వోలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో ఒక్క ఓటు కూడా మిస్ కావొద్దు : పద్మా దేవేందర్ రెడ్డి

మెదక్ అర్బన్, జూన్ 26 : ఎస్.ఐ.ఆర్. పై అనుమానాలు ఉంటే ఎప్పటికప్పుడు పార్టీ నాయకులను, బీఎల్‌వోగా నియమించిన ఏజెంట్లను అడిగి తెలుసుకోవాలని మెదక్ బీఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వార్డులలో ఓట్లు మిస్ కాకూడదన్నారు. మెదక్‌లో ఎస్ ఐ ఆర్ పై అవగాహన సదస్సులో పాల్గొని ఆమె మాట్లాడారు. గ్రామాల్లో కొంతమంది బలవంతంగా ఓట్లు నమోదు చేస్తున్నారని ఇలాంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎస్ ఐ ఆర్ అనే ప్రోగ్రాం కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించిందని, మనకు ఇచ్చిన సమయం లోపల కష్టపడి బీఎల్‌ఓలను కలిసి ఓట్లు మిస్ కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫారుక్ హుస్సేన్, సుభాష్ రెడ్డి, కంటారెడ్డి తిరుపతిరెడ్డి, మామిళ్ళ ఆంజనేయులు, మల్లికార్జున గౌడ్, బట్టి జగపతి, బట్టి ఉదయ్, సురేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ముహమ్మద్ అలీ, సంతు , ప్రదీప్, ఆర్కే శ్రీనివాస్, జుబేర్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అందుబాటులో ఎరువులు
## - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



వరంగల్, జూన్ 26:ప్రస్తుత ఖరీఫ్ (వానకాలం) సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను అందుబాటులో ఉంచేందుకే ప్రభుత్వం 'ఆకా సెంటర్లను' ప్రవేశపెట్టిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆకా సెంటర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు యూరియా బస్తాల పంపిణీని ఆయన మొదలు పెట్టారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వానకాలం సీజన్‌లో రైతులకు యూరియా బస్తాల కొరత రాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతులు సాంప్రదాయ పద్ధతులతో పాటు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించేందుకు నానో యూరియా, డీఏపీ, పొటాష్ లిక్విడ్‌లను పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఒకే రకమైన పంటలు వేయకుండా, పంటల మార్పిడి విధానాన్ని అవలంబించడం ద్వారా భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని ఆయన రైతులకు పిలుపునిచ్చారు.

రైతుల సంక్షేమం కోసం ప్రజాపాలన ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆకా సెంటర్ యజమాని గుమ్మడి సత్యనారాయణ, చిట్యాల వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ గుమ్మడి శ్రీదేవి, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు ముకిరాల మధువంశీకృష్ణ, పులి తిరుపతిరెడ్డి, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకోమురు, గంగాధరి రవీందర్, కట్కూరి నరేందర్, బుర్ర శ్రీనివాస్, అల్లకొండ కుమార్, దబ్బెట అనిల్, అల్లంరాజు, సర్పంచులు కొడారి అశోక్, నక్క భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : ఎస్పీ అక్షాంశు యాదవ్




నల్గొండ, జూన్ 26:యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని భువనగిరి యాదాద్రి జిల్లా ఎస్పీ అక్షాంశు యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా భువనగిరి పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరి పట్టణంలో 2 కే అవగాహన ర్యాలీని ఎస్పీ అక్షాంశు యాదవ్ ప్రారంభించారు. ఈ ర్యాలీ పాత బస్టాండ్ నుండి ప్రారంభమై వినాయక చౌరస్తా వరకు కొనసాగింది. విద్యార్థులు, ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సమాజంలో మాదక ద్రవ్యాల నిర్మాణంలో యువకులు ముందుండాలన్నారు. విద్యార్థి దశ నుండి సమాజంపై మంచి ఆలోచన పెట్టాలని, సమాజాన్ని బాగు చేయడంతో పాటు తన జీవితాన్ని, తన భవిష్యత్‌ను మంచి మార్గంలో నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎస్పీ రవీందర్, ట్రాఫిక్ డీఎస్పీ ప్రభాకర్ రెడ్డి, సీఐలు చంద్రబాబు, రమేష్, ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐలు అనిల్ కుమార్, నరేష్, పోలీసు అధికారులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# అక్షర క్రతువులో అభిరుచి ప్రాణం: విద్యార్థి కేంద్రిత బోధనే సమగ్ర వికాసానికి ఊతం

అభ్యసనానికి అభిరుచి ప్రాణం, జిజ్ఞాసకు ఆసరా ఏకాగ్రత. అభిరుచి ఉన్న చోటే ఏకాగ్రత అప్రయత్నంగా కుదురుతుంది, ఆ ఏకాగ్రత ఉన్న చోటే జ్ఞాన సముపార్జన సుగమమవుతుంది. జ్ఞానం విస్తరించినప్పుడే సృజనాత్మకత సరికొత్త రూపంలో వికసిస్తుంది. విద్యార్థి చదువులో రాణించాలంటే కేవలం పుస్తకాలు చదవడం, పరీక్షల్లో మార్కులు సాధించడం మాత్రమే పరమావధి కాదు. అతనిలో నేర్చుకోవాలనే ఆసక్తి, తెలుసుకోవాలనే తపన, విషయంపై అమితమైన ప్రేమ ఉండాలి. అందుకే ఆధునిక విద్యాశాస్త్రవేత్తలు అభిరుచిని అభ్యసనానికి మూలాధారంగా, ఒక అదృశ్య శక్తిగా పేర్కొంటారు. విద్యార్థి ఏదైనా విషయాన్ని ఇష్టపడి నేర్చుకుంటే దానిని సులభంగా అర్థం చేసుకుంటాడు, జీవితకాలం గుర్తుంచు కుంటాడు. అదే ఆసక్తి లేని విషయాన్ని బలవంతంగా చదవాల్సి వస్తే అది మనస్సుకు తీరని భారంగా, విసుగుగా మారుతుంది. చదువు అనేది ఆనందదాయకమైన ప్రయాణం కావాలి కానీ, ఒత్తిడితో కూడిన శిక్ష కాకూడదు.

కానీ, విద్యార్థులందరికీ అన్ని సబ్జెక్టులపై ఒకే స్థాయిలో ఆసక్తి ఉండడం సాధ్యం కాదు. కొందరికి గణితం అంటే ఇష్టం, మరికొందరికి భాషలు అంటే ఆసక్తి. కొందరు సైన్స్ ప్రయోగాల్లో ప్రతిభ చూపిస్తే, మరికొందరు సామాజిక శాస్త్రాల్లోని సామాజిక, చారిత్రక అంశాల్లో రాణిస్తారు. ఈ వైవిధ్యం మానవ సహజ లక్షణం. ప్రతి వ్యక్తి ఆలోచనా విధానం, మేధో సామర్థ్యం, ఆసక్తులు, కుటుంబ వాతావరణం, సామాజిక ప్రభావాలు వేర్వేరుగా ఉంటాయి. హార్వర్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ హోవార్డ్ గార్డనర్ ప్రతిపాదించిన 'బహుళ మేధో సామర్థ్యాల సిద్ధాంతం' (Theory of Multiple Intelligences) కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. మనుషుల్లో రకరకాల మేధస్సులు ఉంటాయని, ఒక రంగంలో వెనుకబడిన విద్యార్థి మరొక రంగంలో అద్భుతాలు సృష్టించగలడని ఈ సిద్ధాంతం నిరూపించింది. అందువల్ల విద్యార్థి ఒక సబ్జెక్టులో అత్యుత్తమ మార్కులు సాధించి, మరొక సబ్జెక్టులో తక్కువ మార్కులు పొందడం అత్యంత సహజమైన విషయమని పెద్దలు, విద్యావేత్తలు గుర్తించాలి.

ప్రస్తుత విద్యా వ్యవస్థలో మార్కులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల అనేక గంభీరమైన సమస్యలు ఉత్పన్న మవుతున్నాయి. విద్యార్థి ఒక విషయాన్ని ఎంతవరకు అర్థం చేసుకున్నాడు, దానిని నిత్యజీవితంలో ఎలా అన్వయించుకుంటున్నాడు అన్నదానికంటే పరీక్షలో ఎన్ని మార్కులు సాధించాడు, ఏ ర్యాంకు సాధించాడు అనే అంశానికే సమాజం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది. ఈ వాణిజ్యీకరణ పరిస్థితుల్లో విద్యార్థులు తమకు ఇష్టంలేని సబ్జెక్టులను కూడా కేవలం మార్కుల కోసం, తల్లిదండ్రుల ఒత్తిడి తట్టుకోలేక చదవాల్సి వస్తోంది. ఫలితంగా అర్థం చేసుకుని నేర్చుకునే సృజనాత్మక ప్రక్రియకు బదులుగా బట్టీ పట్టడం విపరీతంగా పెరుగుతోంది. మరికొన్ని సందర్భాల్లో ర్యాంకుల ఒత్తిడి తట్టుకోలేక కొందరు విద్యార్థులు కాపీయింగ్ వంటి అవాంఛనీయ మార్గాల వైపు మొగ్గు చూపడమే కాకుండా, మానసిక కుంగుబాటుకు లోనై ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్న ఉదంతాలు నేడు మనం చూస్తున్నాం.

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికల ప్రకారం, భారతదేశంలో ప్రతి ఏటా పరీక్షల ఒత్తిడి, విద్యాపరమైన వైఫల్యాల భయం కారణంగా వేల సంఖ్యలో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. విద్యా పరిశోధనలు కూడా ఆసక్తి, అభ్యసనాల మధ్య ఉన్న బలమైన సంబంధాన్ని శాస్త్రీయంగా తెలియజేస్తున్నాయి. విద్యార్థి ఒక విషయంపై ఆసక్తి కలిగి ఉంటే అతని మెదడులోని డోపమైన్ వంటి రసాయనాలు విడుదలై జ్ఞాపకశక్తి, విశ్లేషణా సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యాన్ని గణనీయంగా పెంచుతాయని న్యూరోసైన్స్ అధ్యయనాలు నిరూపించాయి. మరోవైపు ఆసక్తి లేని విషయాలను కేవలం పరీక్షల కోసమే తాత్కాలికంగా చదివినప్పుడు, ఆ జ్ఞానం పరీక్ష ముగియగానే మాయమై పోతుందని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు.



ఈ క్లిష్ట నేపథ్యంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకంగా, బాధ్యతాయుతంగా మారుతుంది. విద్యార్థులకు అన్ని సబ్జెక్టులపై ఆసక్తి పెంపొందించడం ఉపాధ్యాయుల ప్రధాన కర్తవ్యం కావాలి. ఒకప్పుడు తరగతి గదిలో ఉపాధ్యాయుడు సర్వాధికారిగా ఉండి చెప్పేది విద్యార్థి నిశ్శబ్దంగా వినడం మాత్రమే జరిగేది. కానీ ఆధునిక విద్యా విధానంలో ఆ పాత పద్ధతులు చెల్లవు, ఇప్పుడు విద్యార్థి కేంద్రిత బోధనకు (Student-Centered Learning) ప్రాధాన్యం పెరిగింది. విద్యార్థి ఆసక్తులు, సామర్థ్యాలు, అవసరాలను గుర్తించి బోధించాల్సిన అవసరం ఎంతైనా ఏర్పడింది. ముందుగా ఉపాధ్యాయుడు విద్యార్థి మనస్తత్వాన్ని లోతుగా అర్థం చేసుకోవాలి. ఏ విద్యార్థికి ఏ సబ్జెక్టుపై ఆసక్తి ఉందో, ఏ సబ్జెక్టులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడో సున్నితంగా పరిశీలించాలి.

ఆసక్తి లేని సబ్జెక్టును కూడా విద్యార్థి నిజ జీవితంతో అనుసంధానం చేసి బోధిస్తే అతనిలో కుతూహలం అప్రయత్నంగా పెరుగుతుంది. ఉదాహరణకు గణితాన్ని కేవలం క్లిష్టమైన సూత్రాల సమాహారంగా కాకుండా, రోజువారీ జీవితంలోని మార్కెట్ లావాదేవీలతో, బడ్జెట్ అంచనాలతో అనుసంధానం చేస్తే విద్యార్థికి భయం పోయి ఆసక్తి కలుగుతుంది. సైన్స్‌ను కేవలం పుస్తకాల్లోని బొమ్మలుగా కాకుండా ప్రయోగశాలలో చిన్న చిన్న ప్రయోగాల ద్వారా, సామాజిక శాస్త్రాలను పొడి అక్షరాలుగా కాకుండా వాస్తవ చారిత్రక సంఘటనలతో, క్షేత్ర పర్యటనలతో బోధించాలి. అలాగే భాషలను కేవలం వ్యాకరణ నియమాలుగా కాకుండా కథలు, కవితలు, నాటకాలు, సంభాషణలతో బోధిస్తే అభ్యసనం ఆనందదాయకమైన ఉత్సవంగా మారుతుంది. తరగతి గదిలో సృజనాత్మక బోధనా పద్ధతులను ఉపయోగించడం నేటి అత్యవసర అవసరం. డిజిటల్ విప్లవం పుణ్యమా అని అందుబాటులోకి వచ్చిన చిత్రాలు, యానిమేషన్ వీడియోలు, నమూనాలు, విద్యాసంబంధ ఆటలు, సమూహ చర్చలు, ప్రాజెక్టులు, పాత్రధారణ (Role Play) వంటి ఆధునిక పద్ధతులు విద్యార్థుల్లో చదువుపై అమితమైన శ్రద్ధను పెంచుతాయి. ఒకే విధమైన పాతకాలపు ఉపన్యాస పద్ధతి విద్యార్థులను నిస్సారంగా మార్చి విసిగిస్తుంది. బోధనలో వైవిధ్యం, నవ్యత ఉంటేనే అభ్యసనంలో చైతన్యం ఏర్పడుతుంది.

దీంతో పాటు విద్యార్థిని ఇతరులతో పోల్చడం అనేది అతని ఆత్మవిశ్వాసాన్ని పునాదులతో సహా దెబ్బతీస్తుంది. ఒక సబ్జెక్టులో తక్కువ మార్కులు వచ్చినప్పుడు అతన్ని మందలించడం లేదా తక్కువ చేసి మాట్లాడడం కంటే, ఆ వెనుకబాటుతనానికి గల అసలు కారణాలను తెలుసుకోవాలి. అతనికి అండగా నిలిచి ప్రోత్సహించాలి. విద్యార్థి చూపే చిన్న పురోగతినైనా గుర్తించి మనస్ఫూర్తిగా ప్రశంసించాలి. ప్రతి విద్యార్థిలో ఒక ప్రత్యేకమైన బలం ఉంటుంది. ఆ బలాలను గుర్తించి, వాటిని ఆధారంగా చేసుకుని బలహీనతలను అధిగమించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశనం చేయాలి. ఈ క్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ కలిసి పనిచేయడం చాలా ముఖ్యం. దురదృష్టవశాత్తూ చాలామంది తల్లిదండ్రులు కేవలం మార్కులనే విజయానికి ఏకైక ప్రమాణంగా భావిస్తూ తమ పిల్లలను ర్యాంకుల రేసు గుర్రాలుగా మారుస్తున్నారు. ఈ సంకుచిత దృక్పథం విద్యార్థుల లేత మనస్సులపై తీవ్రమైన మానసిక ఒత్తిడిని కలిగిస్తుంది. ఫలితంగా వారిలో భయం, ఆందోళన, నిరుత్సాహం పెరిగి సహజ సిద్ధమైన ప్రతిభ నశించిపోతుంది. అందువల్ల మార్కులతో పాటు అభ్యసన నైపుణ్యాలు, సృజనాత్మకత, సమస్య పరిష్కార సామర్థ్యం, భావోద్వేగ నియంత్రణ, ఉత్తమ వ్యక్తిత్వ వికాసం వంటి సమగ్ర అంశాలకు ప్రాధాన్యం ఇవ్వవలసిన సమయం ఆసన్నమైంది.

ప్రపంచవ్యాప్తంగా విద్యా రంగంలో చోటుచేసుకుంటున్న విప్లవాత్మక మార్పులు కూడా ఇదే అభ్యసన ప్రాధాన్యతను సూచిస్తున్నాయి. అంతర్జాతీయ విద్యా ప్రమాణాల సూచీలలో (PISA) అగ్రస్థానంలో ఉండే ఫిన్లాండ్, సింగపూర్, కెనడా వంటి అభివృద్ధి చెందిన దేశాలు కేవలం సంప్రదాయ పరీక్షా ఫలితాలపై కాకుండా నైపుణ్యాల అభివృద్ధిపై, సృజనాత్మక ఆలోచనా ధోరణిపై దృష్టి పెడుతున్నాయి. ముఖ్యంగా ఫిన్లాండ్ విద్యా విధానంలో ప్రాథమిక దశలో అసలు పరీక్షలే ఉండవు. అక్కడ విద్యార్థి ఆసక్తిని, సంతోషాన్ని కేంద్రంగా చేసుకుని బోధనా విధానాలను రూపొందిస్తారు. ఫలితంగా అక్కడి విద్యార్థులు ఎటువంటి మానసిక ఒత్తిడి లేకుండా అత్యుత్తమ అభ్యసన ఫలితాలను సాధిస్తూ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నారు.

భారతదేశంలో కూడా ఈ మార్పు ఆవశ్యకతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం 'జాతీయ విద్యా విధానం-2020' (NEP -2020) ని తీసుకువచ్చింది. ఈ నూతన విధానం విద్యార్థి కేంద్రిత అభ్యసనానికి, సమగ్ర వికాసానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. శతాబ్దాలుగా వస్తున్న బట్టీ విద్యకు స్వస్తి పలికి, భావనాత్మక అవగాహన (Conceptual Understanding), విమర్శనాత్మక ఆలోచన (Critical Thinking), అనుభవాత్మక అభ్యసనం (Experiential Learning) పై ఈ విధానం ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టులను ఎంచుకునే స్వేచ్ఛను కల్పించడం ద్వారా, విద్యా రంగంలో సరికొత్త సంస్కరణలకు ఇది నాంది పలికింది. ఇది విద్యార్థులలో వివిధ సబ్జెక్టులపై సహజసిద్ధమైన ఆసక్తిని పెంపొందించే దిశగా ఒక చారిత్రాత్మక మైలురాయిగా చెప్పవచ్చు.

ముగింపుగా చెప్పాలంటే, అన్ని సబ్జెక్టులలో విద్యార్థి రాణించి, జ్ఞానాన్ని సంపాదించాలంటే కేవలం ఎక్కువ గంటలు పుస్తకాల ముందు కూర్చోబెట్టి చదివించడం వల్ల ప్రయోజనం లేదు. ఆయా విషయాలపై అంతర్గతంగా ఆసక్తి కలగాలి. ఆ ఆసక్తిని, జిజ్ఞాసను కలిగించే పవిత్రమైన బాధ్యత ఉపాధ్యాయ సమాజంపై, తల్లిదండ్రులపై ఉంది. బోధనను కేవలం సిలబస్ పూర్తి చేసే ప్రక్రియగా కాకుండా, దానికి జీవాన్ని నింపగలిగిన ఉపాధ్యాయుడు విద్యార్థి భవిష్యత్తును మహోజ్వలంగా మార్చగలడు. ఒక సాధారణ ఉపాధ్యాయుడు పాఠాన్ని చెప్తాడు, ఒక మంచి ఉపాధ్యాయుడు వివరిస్తాడు, కానీ ఒక గొప్ప ఉపాధ్యాయుడు విద్యార్థిలో నేర్చుకోవాలనే ప్రేరణను, ఆసక్తిని రగిలిస్తాడు. కేవలం అక్షరాలు నేర్పడం కాదు, నేర్చుకోవడాన్ని ప్రేమించే మనస్తత్వాన్ని పెంపొందించడమే నిజమైన విద్యాబోధన. అంతర్గత అభిరుచిని, విచక్షణా జ్ఞానాన్ని వేల్కొలిపే విద్యే నిజమైన విద్య. అలాంటి ఆనందదాయకమైన విద్య ద్వారా మాత్రమే మార్కులతో పాటు నిజమైన జ్ఞానం, వృత్తిపరమైన నైపుణ్యాలు, మానవీయ విలువలు, సత్ప్రవర్తన సమగ్రంగా వికసించి, విద్యార్థి భవిష్యత్తు సమాజానికి ఉపయోగపడే విధంగా విజయవంతంగా రూపుదిద్దుకుంటుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# సీఎం రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలి

## -మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి



నల్గొండ, జూన్ 26: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 28న కనగల్ మండల కేంద్రంలో సుమారు రూ.13 వేల కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆర్అండ్‌బీ రహదారి పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో, అనంతరం నల్గొండ ఎన్జీ కళాశాల మైదానంలో జరిగే భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు.

శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో పార్టీ ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో సీఎం సభ విజయవంతం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై చర్చించారు.

అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడుతూ, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారత కోసం వడ్డీలేని రుణాలు సహా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ నెల 28న జరిగే సీఎం సభ చారిత్రాత్మకంగా నిలిచేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు.

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.

బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా ఉండి ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని అన్నారు.

ఈ నెల 28న జరిగే బహిరంగ సభకు నల్గొండ నియోజకవర్గం నుంచి 60 వేల మందికి పైగా ప్రజలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కనగల్ వద్ద ఆర్అండ్‌బీ రహదారి పనులకు శంకుస్థాపనతో పాటు, మెడికల్ కళాశాల నుంచి దుప్పలపల్లి వరకు రూ.250 కోట్లతో నిర్మించే రహదారికి కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

అలాగే నియోజకవర్గంలో రూ.430 కోట్లతో ఎన్ఎల్‌బీసీ కాలువ లైనింగ్ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సీఎం సభలో నల్గొండకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రకటించే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ పాశం రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని, సభ విజయవంతానికి పార్టీ శ్రేణులంతా సమిష్టిగా కృషి చేయాలని కోరారు.

ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమీర్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్లు ఆలకుంట నాగరత్నం రాజు, పాశం సంపత్‌రెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక మొహర్రం కౌన్సిలర్ వాసాల లావణ్య శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, జూన్ 26: (నేటినిజం ప్రతినిధి): ధర్మం, సత్యం, త్యాగానికి ప్రతికగా మొహర్రం నిలుస్తుందని నిలుస్తుందని వేములవాడ మున్సిపల్ పరిధిలోని 5 వార్డ్ కౌన్సిలర్ వాసాల లావణ్య శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామంలో మొహరం పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పీర్ల పండగ తెలంగాణలో మతసామరస్యానికి హిందూ ముస్లిం ఐక్యతకు ప్రతికగా జరుపుకుంటారని అన్నారు. పీరీల పండుగ పేరుతో ప్రజలు సహోదర భావంతో కుల మతాలకు అతీతంగా పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు మున్నాభాయ్, జావిద్, వివిధ మతాల కుల పెద్దలు పోచంపల్లి రాజు, దండుగుల తిరుపతి, నగరపు లచ్చయ్య, చిరంజీవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బడేటి క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం...



ఏలూరు, జూన్ 26: ప్రజల ఇబ్బందులను తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపుతూ వారిలో భరోసా నింపే లక్ష్యంతోనే జవాబుదారీ పాలనకు శ్రీకారం చుట్టామని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పునరుద్ఘాటించారు. ప్రజల సమస్యలను పరిష్కరించి, వారి ముఖాల్లో చిరునవ్వులు పూయించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోందని అన్నారు.

ఏలూరు పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలు, వినతుల రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు.

ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు ఇంటి స్థలాలు కేటాయించాలని అర్జీలు అందించగా, మరికొందరు సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని వినతులు సమర్పించారు. ఇంకొందరు తమ వ్యక్తిగత, స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.

వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే బడేటి చంటి, అధైర్యపడాల్సిన అవసరం లేదని వారికి భరోసా కల్పించారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపగా, మరికొన్నింటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వర చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పారదర్శక విధానాలతో జవాబుదారీ పాలన అందిస్తోందని చెప్పారు. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటున్నానని తెలిపారు. అర్జీలు, వినతులు సమర్పించిన వారి వివరాలను నమోదు చేసి, సమస్యలు పరిష్కరించిన తర్వాత వారి ఆనందంలో భాగస్వామి కావడం ఎంతో ఆత్మసంతృప్తిని ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూత

## -మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు .

అమరావతి, జూన్ 26: మైలవరం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 141 మంది లబ్ధిదారులకు రూ.1,47,59,839లు ఆర్థిక సాయం మంజూరైనట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు. 95 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.61,20,765 విలువైన రీ ఎంబర్స్ మెంట్ చెక్కులు మంజూరయ్యాయి. మరో 46 మందికి ఎల్.ఓ.సీల ద్వారా రూ.86,39,074లు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారు తెలిపారు. మైలవరంలోని శాసనసభ్యుని కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ రీ ఎంబర్స్ మెంట్ చెక్కులను, ఎల్.ఓ.సీలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు.

రెడ్డిగూడెం, మైలవరం, జి.కొండూరు మండలాలకు చెందిన లబ్ధిదారులు ఇక్కడ చెక్కులు, ఎల్.ఓ.సిలు తీసుకున్నారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. సీఎం గారి సందేశ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలానికి 20 చెక్కులు, మైలవరం మండలానికి 25 చెక్కులు, జి.కొండూరు మండలానికి 24 చెక్కులు, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో 8 చెక్కులు, ఇబ్రహీంపట్నం మండలానికి 7 చెక్కులు, విజయవాడ రూరల్ మండలానికి 11 చెక్కులు మంజూరయ్యాయని వివరించారు.

పేద ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అనేక కుటుంబాలు వైద్య ఖర్చుల భారం నుంచి బయటపడుతున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

Printed, Published and owned by VEENADAS, at
Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at
SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.